


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 8-10-2026 | సంపుటి - 31 | సంచిక - 136 | రూ : 4 | పేజీలు: 8

అమెరికాకు భారీ ఎదురుదెబ్బ

రూ.31 వేల కోట్ల ఆయుధాలు ధ్వంసం

- ఇరాన్‌తో సైనిక చర్యల్లో అమెరికాకు భారీ నష్టం
- ఫిబ్రవరి నుంచి 81 విమానాలు, డ్రోన్లు ధ్వంసం లేదా దెబ్బతిన్నాయని వెల్లడి
- పునరుద్ధరణ ఖర్చు రూ.31,000 కోట్లకు చేరవచ్చని అంచనా
- అత్యధికంగా 45 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు ధ్వంసం
- కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ నివేదికలో కీలక వివరాలు



ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన సైనిక చర్యల్లో ఆ దేశానికి భారీగా వైమానిక నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో ఇప్పటివరకు కనీసం 81 అమెరికా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, మానవ రహిత డ్రోన్లు (యూఏవీ) ధ్వంసం కావడం లేదా దెబ్బతినడం జరిగిందని అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) తన తాజా నివేదికలో వెల్లడించింది. ధ్వంసమైన ఈ తరువాయి 2లో



జాతికి మోదీ పిలుపు

'పంచ లక్ష్యాల' సరికొత్త మంత్రం

- 'మనం సాధించగలం' అంటూ మోదీ నినాదం
- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీ
- 2047 నాటికి వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాల ప్రకటన

ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్నిపురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తరువాయి 2లో

ఢిల్లీలో కుప్పకూలిన భవనం..

కొనసాగుతున్న సహాయక పనులు

- ఢిల్లీలోని సీమాపురిలో కూలిన ఐదంతస్తుల భవనం
- శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానం
- ఘటనా స్థలంలో ముమ్మరంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- ఆ ప్రాంతానికి రావొద్దని ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు సూచన 2లో





రూ.1,108 కోట్లతో ఓంకారేశ్వరాలయం

- పరిపాలన అనుమతి మంజూరు చేసిన ప్రభుత్వం
- మూసీ పునరుజ్జీవంలో భాగంగా మంచిరేవులలో వీరభద్రస్వామి గుట్టపై నిర్మాణం
- అభివృద్ధి పనుల పర్యవేక్షణకు కమిటీ

హైదరాబాద్: మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలోని వీరభద్రస్వామి గుట్టపై రూ.1,108.27 కోట్లతో ఓంకారేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రధాన దేవాలయ నిర్మాణానికి రూ.598.98 కోట్లు, చుట్టూ భవనాలు, వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనులకు రూ.349.67కోట్లు, ఆలయాన్ని అనుసంధానిస్తూ మూసీ ఒడ్డున రూ.159.62 కోట్లతో రోడ్డు నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇస్తూ పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ బుధవారం తరువాయి 2లో

జ్ఞానేశ్‌కుమార్‌తో

రాజీనామా చేయించాలి



- లేదంటే మోదీ, అమిత్‌షాలే రాజీనామా చేయాల్సి వస్తుంది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక

దిల్లీ: సర్ పేరుతో సామాన్యుల ఓట్లను తొలగిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌తో మోదీ, అమిత్‌షాలు రాజీనామా చేయించాలని, లేదంటే వారే రాజీనామా చేయాల్సి వస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో జంతర్‌మంతర్‌లో ఆందోళన చేపట్టిన రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలను పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో వారికి సంఘీభావం తెలపడానికి బుధవారం రేవంత్ దిల్లీకొచ్చారు. రాహుల్‌ను బారాఖంబా స్టేషన్‌కు తరలించాలని తెలుసుకొని రేవంత్‌రెడ్డి, కేరళం ముఖ్యమంత్రి వీడీసతీశన్‌లు అక్కడికి వెళ్లారు. వీరి రాకను ముందే పసిగట్టిన పోలీసులు మరో గేటు నుంచి రాహుల్‌ను తరువాయి 2లో

రైలులో చెలరేగిన మంటలు..

తప్పిన ముప్పు!

- యాదాద్రి జిల్లా బీబీనగర్ సమీపంలో ఘటన
- బ్రేక్ లైనర్, చక్రం రాపిడితో చెలరేగిన మంటలు
- ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడి
- మరమ్మతుల తర్వాత రైలు తిరిగి ప్రయాణం 2లో



ప్లేగు భయం లేదు

స్పష్టం చేసిన రష్యా




- సైబీరియాలో ల్యాబ్ ఉద్యోగి మృతితో ప్లేగుపై ఆందోళన
- ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేసిన రష్యా ఆరోగ్య శాఖ
- డబ్ల్యూహెచ్ఓకు సమాచారం ఇచ్చామని, పుకార్లను నమ్మవద్దని సూచన
- రష్యా మరింత పారదర్శకంగా ఉండాలన్న అమెరికా
- మృతురాలి కాంటాక్టులకు నెగెటివ్ అని తెలిపిన అధికారులు

తూర్పు సైబీరియాలోనిఇర్కుట్స్క్ రీజియన్‌లో ఓ ల్యాబొరేటరీ ఉద్యోగి మృతి చెందడంతో ప్లేగు మహమ్మారి తరువాయి 2లో

అణువుల గుట్టు విప్పిన పరిశోధన

ఇద్దరికి కెమిస్ట్రీ నోబెల్

- రసాయన శాస్త్రంలో 2026 సంవత్సరానికి నోబెల్ బహుమతి ప్రకటన
- ఫ్రాన్స్ శాస్త్రవేత్త హెన్రీ కగన్, జపాన్ శాస్త్రవేత్త కెన్సో సోయ్‌లకు పురస్కారం
- అణువుల అసమానత, స్వీయ ఉత్ప్రేరణపై పరిశోధనలకు ఈ గౌరవం
- ఔషధాలు, పరిమళాల తయారీలో కీలకం కానున్న ఈ ఆవిష్కరణలు



రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. ఫ్రాన్స్‌లోని పారిస్ సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది. అసమాన సేంద్రియ సంశ్లేషణలో నాన్‌లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను తరువాయి 2లో

జ్ఞానేశ్‌కుమార్‌తో రాజీనామా చేయించాలి

ఢిల్లీ: సర్ పేరుతో సామాన్యుల ఓట్లను తొలగిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌తో మోదీ, అమిత్‌షాలు రాజీనామాచేయించాలని,లేదంటేవారేరాజీనామా చేయాల్సి వస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో జంతర్‌మంతర్‌లో ఆందోళన చేపట్టిన రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలను పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో వారికి సంఘీభావం తెలపడానికి బుధవారం రేవంత్ దిల్లీకొచ్చారు. రాహుల్‌ను బారాఖంబా స్టేషన్‌కు తరలించాలని తెలుసుకొని రేవంత్‌రెడ్డి, కేరళం ముఖ్యమంత్రి వీడీసతీశన్‌లు అక్కడికి వెళ్లారు. వీరి రాకను ముందే పసిగట్టిన పోలీసులు మరో గేటు నుంచి రాహుల్‌ను తరలించడంతో రేవంత్‌రెడ్డి వారిని కలవలేకపోయారు. అనంతరం స్టేషన్ బయట విలేకర్లతో మాట్లాడారు.''జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోసం పోరాటం చేస్తున్న రాహుల్‌గాంధీపై ప్రభుత్వం దాడి చేయడానికి ప్రయత్నించింది. ఇందుకు బాధ్యులైన వారిని మేం వదిలిపెట్టబోం.

గతంలో సీబీఐ, ఈడీ.. ఇప్పుడు ఈసీ

ఎన్నికల్లో గెలవడానికి మోదీ గతంలో సీబీఐ, ఈడీలను ఉపయోగించారు. వీటితో సాధ్యంకాని పశ్చిమబెంగాల్, బిహార్ లాంటి రాష్ట్రాల్లో ఎన్నికల కమిషన్(ఈసీ)ని ఉపయోగించడం మొదలుపెట్టారు. ఈ దేశంలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడానికి రాజ్యాంగం ద్వారా ఎన్నికల సంఘాన్ని ఏర్పాటుచేశారు. ప్రజలు ఓటేసి గెలిపించిన పార్టీలు ప్రభుత్వాలు ఏర్పాటుచేసేలా చూడటం దాని బాధ్యత. కానీ ఇప్పుడు మోదీకి వ్యతిరేకంగా ఓటేసే దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మేధావుల ఓట్లను తీసేసి ఆయన్ను ఎన్నికల్లో గెలిపించడానికి కృషిచేస్తోంది. రిజర్వేషన్లు తొలగించడానికి, రాజ్యాంగాన్ని మార్చడానికి, ఎన్నికల్లో గెలవడానికి మోదీ ఈసీని వాడుకుంటున్నారు. ఆయన చేతిలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఒక పావుగా మారారు. పోలీసులు తప్పుచేసిన వారిని కాకుండా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు పోరాడుతున్న వారిని అరెస్ట్‌చేశారు. దీని వెనుక అమిత్‌షా ఉన్నారు. ఉగ్రవాదుల తరహాలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, ఖర్గే, ప్రియాంకాగాందీ, ఇతర ఎంపీలను అరెస్ట్ చేసి వాహనాల్లోకి విసిరేశారు. ఇంత అన్యాయానికి ఒడిగడుతున్న మోదీని ప్రజలు క్షమించరు. 50వ దశకం నుంచి ఇప్పటివరకూ పేదలకు ఓటివ్వడానికి సర్‌లు నిర్వహిస్తే ఇప్పుడు తొలగించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ తప్పును సరిదిద్దడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. వందేళ్ల క్రితం సైమన్‌గోబ్యాక్ ఉద్యమం నిర్వహించినట్లుగానే ఇప్పుడు ఇండియా కూటమి సర్ గోబ్యాక్ ఉద్యమాన్ని నిర్వహిస్తోంది. ఆనాడు సైమన్‌ను రక్షించడానికిపోయి బ్రిటిషర్లు తమ రాజ్యాన్ని పోగొట్టుకున్నారు. ఇప్పుడు జ్ఞానేశ్‌కుమార్‌ను రక్షించడానికి మోదీ ప్రయత్నిస్తే వారి ప్రభుత్వం కూలిపోతుంది. సాగుచట్టాల సమయంలోనూ తొలుత ఆయన ఇలాగా మొండిగా వ్యవహరించారు. ఆ తర్వాత చట్టాలను రద్దుచేసి రైతులకు క్షమాపణలు చెప్పారు. ఇప్పుడు కూడా ఎంత మొండిగా వ్యవహరించినప్పటికీ ముమ్ముందు జ్ఞానేశ్‌కుమార్‌తో రాజీనామా చేయించి క్షమాపణలు చెప్పాల్సి వస్తుంది. లేదంటే ప్రధానమంత్రి రాజీనామా కోసం పోరాటం చేస్తాం. ఈ ఆందోళన ఇక్కడితో ఆగిపోదు. ఇందులోజెన్‌జీ పాలుపంచుకుంటోంది.ముమ్ముందు ఏం జరిగినా అందుకు మోదీ, అమిత్‌షాలే బాధ్యత వహించాలి'' అని ముఖ్యమంత్రి మాట్లాడారు. ఆయన వెంట రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, గడ్డం వంశీకృష్ణ తదితరులున్నారు.

అణువుల గుట్టు విప్పిన

పరిశోధన ఇద్దరికి కెమిస్ట్రీ నోబెల్

రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. ఫ్రాన్స్‌లోని పారిస్‌సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది. అసమాన సేంద్రియ సంశ్లేషణలో నాన్‌లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను వారిని ఈ పురస్కారం వరించినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. ప్రకృతిలో అనేక అణువులు, ముఖ్యంగా మన శరీరంలోని అమైనో ఆమ్లాల వంటివి రెండు ప్రతిబింబ రూపాల్లో ఉంటాయి. అయితే, జీవరాశులు కేవలం ఒకే రూపాన్ని వినియోగించుకుంటాయి. ఈ రసాయన అసమానత లేదా 'హోమోకిరాలిటీ' ఎలా సాధ్యమవుతుందనేది శాస్త్రవేత్తలకు శతాబ్దాలుగా ఓ పెద్ద మిస్టరీ. ఈ రహస్యాన్ని ఛేదించడంలో కగన్, సోయ్ చేసిన పరిశోధనలు కీలకపాత్ర పోషించాయి. ఒక రసాయన చర్యలో ఊహించిన దానికంటే ఎక్కువ స్థాయిలో ఒకే ప్రతిబింబ రూపాన్ని ఉత్పత్తి చేయవచ్చని హెన్రీ కగన్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు.మరోవైపు కెన్సో సోయ్ స్వీయ ఉత్ప్రేరణ ప్రక్రియను అభివృద్ధిచేసి ఈ రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ ప్రక్రియలో ఒక చర్య ద్వారా ఏర్పడిన ఉత్పత్తి,తనంతట తానే ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అదే రకమైన అణువుల ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల అతి స్వల్ప అసమతుల్యతతో ప్రారంభమైనా, చివరికి దాదాపుగా ఒకే రూపానికి చెందిన అణువులు మాత్రమే ఏర్పడతాయి. ఈ ఆవిష్కరణలు అద్భుతమైనవని, శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యాన్ని ఇది ఛేదించిందని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే కొనియాడారు. కగన్, సోయ్‌ల పరిశోధనలు సైద్ధాంతికంగానే కాకుండా ఆచరణలో కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఔషధాల తయారీ, సువాసనలు, పరిమళాలు, ఇతర రసాయన పదార్థాల ఉత్పత్తిలో అవసరమైన చర్యలను రూపొందించడానికి వీరి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పురస్కారం కింద ఇద్దరు శాస్త్రవేత్తలు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల ప్రైజ్ మనీని పంచుకుంటారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పతకాలను ప్రదానం చేస్తారు.

రూ.1,108 కోట్లతో ఓంకారేశ్వరాలయం

హైదరాబాద్: మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవులలోని వీరభద్రస్వామి గుట్టపై రూ.1,108.27 కోట్లతో ఓంకారేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.ప్రధాన దేవాలయ నిర్మాణానికి రూ.598.98 కోట్లు, చుట్టూ భవనాలు, వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనులకు రూ.349.67కోట్లు, ఆలయాన్ని అనుసంధానిస్తూ మూసీ ఒడ్డున రూ.159.62 కోట్లతో రోడ్డు నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇస్తూ పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ బుధవారం ఉత్తర్వులిచ్చారు.

సాంకేతిక కమిటీ ఏర్పాటు..

ఆలయ నిర్మాణ పనుల పర్యవేక్షణకు ప్రభుత్వం ఉన్నతస్థాయి సాంకేతిక కమిటీని నియమించింది. కమిటీ ఛైర్మన్‌గా రోడ్లు భవనాలశాఖ ఈఎన్‌సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్) ఉంటారు.ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీ కోఛైర్మన్‌గా, ఎంఆర్‌డీసీఎల్ ముఖ్య ఇంజినీరు(సీఈ) కన్వీనరుగా, దేవాదాయశాఖ సీఈ, ఆలయ శిల్పకళా నిపుణులు (స్థపతి) డాక్టర్ శివనాగిరెడ్డి, ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి సభ్యులుగా పనిచేయనున్నారు. డిజైన్లు, ప్రణాళిక ప్రకారం పనులు, ధరలను నిర్ణయించడం, అంచనా వ్యయాలకు సాంకేతిక ఆమోదం తెలపడం, టెండర్లు, ఇతరత్రా కార్యక్రమాలను ఈ కమిటీ నిర్వహిస్తుంది.

ఆలయ నిర్మాణం ఇలా..

మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) రూపొందించిన డీపీఆర్(పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక) ప్రకారం.. మంచిరేవులలోని చారిత్రక వీరభద్రస్వామి, మచిలేశ్వరస్వామి ఆలయాల పక్కన 8 ఎకరాల్లో ఓంకారేశ్వరస్వామి ఆలయ సముదాయం నిర్మాణం కానుంది.అందులో శ్రీ వీరభద్రభద్రకాళి ఆలయం, శ్రీ లలితా మహా త్రిపురసుందరీదేవి, శ్రీ బాలగణపతి స్వామి, శ్రీ బాలసుబ్రహ్మణ్య స్వామి ఉపాలయాలుంటాయి. మహా మండపం, నంది మండపం, ప్రాకారాలు, రాజగోపురాలు, యాగశాల, పుష్కరిణి, ఆలయం దిగువ ఉన్న మూసీనదిలో ఎత్తయిన శివుని విగ్రహం, పలు అంతస్తుల్లో పార్కింగ్ కాంప్లెక్సు, వసతి గదులు, ఇతరత్రా భవన నిర్మాణాలు ప్రాజెక్టులో భాగం. గర్భాలయం ఎత్తు 64 అడుగులు.మహా మండపం 44 స్తంభాలతో నిర్మాణమవనుంది. కాకతీయ ఆలయ నిర్మాణ మూల శైలిని ప్రతిబింబించే నాగర శైలి వాస్తుకళతో ఆలయ శిఖరాలు రూపుదిద్దుకోనున్నాయి. ఆలయ సముదాయం 2 ప్రాకారాలతో, నాలుగు దిక్కులా 8 భారీ రాజ గోపురాలతో ఉంటుంది. ముందు భాగంలో 91 అడుగుల ఎత్తు, 9 అంతస్తుల్లో మహా రాజగోపురం నిర్మిస్తారు. ఆలయ నిర్మాణానికి రామప్ప దేవాలయం పరిసర ప్రాంతాల్లో లభ్యమయ్యే రాయిని ఉపయోగించనున్నారు.

100 అడుగుల రోడ్డు..

హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్ విండ్ విల్లాస్ వరకు 2.50 కిలోమీటర్ల పొడవున, 100అడుగుల వెడల్పుతో రహదారిని నిర్మిస్తారు. ఓంకారేశ్వర ఆలయాన్ని అనుసంధానిస్తూ..గ్రేహౌండ్స్ భూములు, యంగ్ ఇండియా పోలీసు పాఠశాలను కలుపుతూ ఇరువైపులా రిటైనింగ్ వాల్, వరద కాలువలతో మూసీ నది ఒడ్డున రహదారి నిర్మిస్తారు.

అమెరికాకు భారీ ఎదురుదెబ్బ: రూ.31 వేల కోట్ల ఆయుధాలు ధ్వంసం

ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన సైనిక చర్యల్లో ఆ దేశానికి భారీగా వైమానిక నష్టం వాటిల్లుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో ఇప్పటివరకు కనీసం 81 అమెరికా యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, మానవ రహిత డ్రోన్లు (యూఏవీ) ధ్వంసం కావడం లేదా దెబ్బతినడం జరిగిందని అమెరికా కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) తన తాజా నివేదికలో వెల్లడించింది. ధ్వంసమైన ఈ పరికరాల స్థానంలో కొత్తవి సమకూర్చుకోవడానికి అయ్యే ఖర్చు 3.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 31,000 కోట్లు) వరకు ఉండొచ్చని అంచనా. అక్టోబర్ 5న విడుదల చేసిన ఈ తాజా నివేదిక.. అమెరికా సైనిక ప్రకటనలు, మీడియా కథనాలు, రక్షణ శాఖ నివేదికల ఆధారంగా రూపొందింది. మే నెలలో విడుదల చేసిన నివేదికలో ఈ సంఖ్య 42గా ఉండగా, తాజా నివేదికలో ఇది 81కి చేరడం గమనార్హం.మే తర్వాత జరిగిన నష్టాలతో పాటు గతంలో లెక్కలోకి రాని ఘటనలను కూడా చేర్చడం వల్లే ఈ సంఖ్య పెరిగినట్లు నివేదిక స్పష్టం చేసింది. దెబ్బతిన్న కొన్ని విమానాలు మరమ్మతుల అనంతరం తిరిగి విధుల్లో చేరాయని కూడా పేర్కొంది. సైనిక కార్యకలాపాలు ఇంకా కొనసాగుతుండటంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

డ్రోన్లదే అధిక నష్టం

ఈ నష్టాల్లో మానవ రహిత డ్రోన్ల వాటానే అధికంగా ఉంది. నివేదిక ప్రకారం, కనీసం 45 ఎంక్యూ9 రీపర్ డ్రోన్లు ధ్వంసమయ్యాయి. యుద్ధానికి ముందు సుమారు 165గా ఉన్న రీపర్ డ్రోన్ల సంఖ్య, మే నాటికే 135కి పడిపోయింది. వీటితో పాటు ఒక ఎంక్యూ4సీ ట్రైటాన్, మూడు ఎంక్యూ1 సిరీస్ డ్రోన్లు కూడా నష్టపోయిన జాబితాలో ఉన్నాయి.

యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు

మానవ సహిత యుద్ధ విమానాల విషయానికొస్తే, 12 ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగిల్ విమానాలు దెబ్బతిన్నాయి. వీటిలో మూడు విమానాలు మార్చి 2న కువైట్ గగనతలంలో 'ఫ్రెండ్లీ ఫైర్' (స్వయంగా జరిపిన దాడి) కారణంగా కూలిపోగా, పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. మరో విమానం ఏప్రిల్‌లో ఇరాన్‌పై కూలిపోగా, సిబ్బందిని రక్షించారు. సెప్టెంబర్‌లో జోర్డాన్‌లోని వైమానిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో మరో 8 విమానాలు స్వల్పంగా దెబ్బతిని, మరమ్మతుల తర్వాత తిరిగి విధుల్లో చేరాయి. వీటితో పాటు ఒక ఎఫ్35ఏ లైట్నింగ్ II, రెండు ఏ10 థండర్‌బోల్ట్ II, ఏడు కేసీ135 స్ట్రాటోట్యాంకర్లు, ఒక ఈ3 సెంట్రీ, రెండు ఎంసీ130జే కమాండో II విమానాలు ధ్వంసం లేదా దెబ్బతిన్నాయి. హెలికాప్టర్ల విభాగంలో ఒక ఏహెచ్64 అపాచీ, నాలుగు ఏహెచ్6 లిటిల్ బర్డ్స్, ఒక ఎంహెచ్60 సీ హాక్, ఒక హెచ్ హెచ్ 60డబ్ల్యూ జూలీ గ్రీన్ II నష్టపోయినట్లు నివేదిక వివరించింది.

భారీ వ్యయం

కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) అంచనా ప్రకారం కేవలం ధ్వంసమైన పరికరాల స్థానంలో కొత్తవి కొనడానికే 1.9 బిలియన్ డాలర్ల నుంచి 3.3 బిలియన్ డాలర్ల వరకు ఖర్చవుతుంది. అయితే, ఈ మొత్తం ఘర్షణ కోసం యూఎస్ సెంట్రల్ కమాండ్ ఇప్పటివరకు వెచ్చించిన మొత్తం సుమారు 43.6 బిలియన్ డాలర్లుగా ఉంది.





ప్లేగు భయం లేదు: స్పష్టం చేసిన రష్యా

తూర్పు సైబీరియాలోని ఇర్కుట్స్క్ రీజియన్‌లో ఓ ల్యాబొరేటరీ ఉద్యోగి మృతి చెందడంతో ప్లేగు మహమ్మారి వ్యాప్తి చెందుతుందనే ఆందోళనలపై రష్యా స్పందించింది. ఇది కేవలం ల్యాబ్‌కు పరిమితమైన ఒకేఒక్క ఘటన అని, ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేసింది. అయితే, ఈ విషయంలో మరింత పారదర్శకత అవసరమని అమెరికా కోరడంతో అంతర్జాతీయంగా ఈ ఘటనపై చర్చ మొదలైంది. రష్యా ఆరోగ్య పర్యవేక్షణ సంస్థ 'రోస్పోట్రెబ్నాడ్జోర్' ఈ వార్తలను తోసిపుచ్చింది. ఇర్కుట్స్క్ ప్రాంత ప్రజలకు ఎలాంటి అంటువ్యాధి ప్రమాదం లేదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మరణించిన ఉద్యోగితో సన్నిహితంగా మెలిగిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఎవరిలోనూ ఇన్‌ఫెక్షన్ లేదా ప్రమాదకరమైన వ్యాధికారక క్రిముల ఆనవాళ్లు కనిపించలేదని స్పష్టం చేసింది. ముందుజాగ్రత్త, నివారణ చర్యలు పూర్తిస్థాయిలో అమలు చేశామని, ఈ పరిస్థితిపై ప్రపంచ ఆరోగ్య సంస్థకు (WHO) కూడా సమాచారం అందించామని పేర్కొంది. క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కూడా ఈ విషయంపై స్పందించారు. నిబంధనల ప్రకారమే గత వారంలో డబ్ల్యూహెచ్ఓకు సమాచారం అందించామని ధృవీకరించారు. కొన్ని మీడియా సంస్థలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై మరింత పారదర్శకత కోరుతూ అమెరికా దౌత్యపరంగా ఫిర్యాదు చేసిందని తెలిపారు. అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని ఆయన సూచించారు. ఇర్కుట్స్క్‌లోని ఓ స్థానిక టీవీ ఛానల్ కథనం ప్రకారం, సదరు మహిళ అక్టోబర్ 2న షెలెఖోవ్ పట్టణంలోని ఆసుపత్రిలో మరణించారు. వెంటనే ఆసుపత్రిని క్వారంటైన్ చేసి, ఆమెతో సన్నిహితంగా ఉన్నవారిని పర్యవేక్షణలో ఉంచారు. మంగళవారం నాటికి వారిలో ఎవరికీ ప్లేగు లక్షణాలు బయటపడలేదని అధికారులు ప్రకటించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ గాబ్రియేసస్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. ఆ ప్రాంతంలో ప్లేగు కేసులేవీ నమోదు కాలేదని రష్యా అధికారులు తమకు నివేదించారని చెప్పారు. రష్యా వెలుపల ఈ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం చాలా తక్కువగా ఉందని డబ్ల్యూహెచ్ఓ ముందుగానే అంచనా వేసింది. మృతురాలి అనారోగ్యాన్ని రష్యా అధికారులు సాధారణ "శ్వాసకోశ వైరల్ ఇన్‌ఫెక్షన్"గా అభివర్ణించారు. మరోవైపు, ఈ ఘటనపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న వివరాలు చాలా పరిమితంగా ఉన్నాయని, ఈ పరిస్థితి చిన్నదా లేక తీవ్రమైనదా అనేది అస్పష్టంగా ఉందని అన్నారు. రష్యా మరింత సమాచారం పంచుకోవాలని ఆయన కోరారు. ఈ ఘటన కోవిడ్ 19 మూలాలపై జరిగిన చర్చలను గుర్తుచేస్తోంది. సాధారణంగా ఎలుకల ద్వారా వ్యాపించే బ్యుబోనిక్ ప్లేగుకు భిన్నంగా, శ్వాసకోశ కణాల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే న్యుమోనిక్ ప్లేగు అత్యంత ప్రమాదకరమైనది. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

జాతికి మోదీ పిలుపు: 'పంచ లక్ష్యాల' సరికొత్త మంత్రం

ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" (We Will Do It) అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తిచేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు.సరిగ్గా పాతికేళ్ల క్రితం, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేశూభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రత్యేకమైన రోజును కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దేశం కోసం కొత్త సంకల్పం తీసుకునే రోజుగా ఆయన మలిచారు. "ఈ రోజు కేవలం గతాన్ని స్మరించుకునేది మాత్రమే కాదు, మన సంకల్పంలో కొత్త శక్తిని నింపే రోజు. మనం ఏదైనా సాధించగలమనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించే రోజు" అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంతో పాటు మరో ఐదు కీలక లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచారు. అవి:

1. ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం.
2. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం.
3. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) తీర్చిదిద్దడం.
4. ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం.
5. అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేపట్టడం.

ప్రధాని మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రకటిస్తున్నప్పుడు, స్టేడియంలోని వేలాది మంది ప్రజలు "మనం సాధించగలం" అంటూ మిన్నంటేలా నినదించారు. ఈ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అసాధారణమైనవని ప్రధాని ప్రశంసించారు.

సంక్షోభాలను ఎదుర్కొని నిలిచాం

గతంలో సంక్షోభాలు తలెత్తినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేదని, కానీ నేడు సంక్షోభ సమయాల్లో భారత్ చూపుతున్న పటిష్ఠత, స్థితిస్థాపకత గురించి ప్రపంచం చర్చించుకుంటోందని మోదీ అన్నారు. "ఒకప్పుడు దేశంలో విధానపరమైన స్తబ్ధత (పాలసీ పారాలిసిస్) గురించి చర్చ జరిగేది. నేడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు" అంటూ అప్పటి యూపీఏ2 ప్రభుత్వాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

చిన్న లక్ష్యాలు పెట్టుకోవడం దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడమేనని, అందుకే భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకేనని మోదీ స్పష్టం చేశారు.



సవాళ్ల నడుమ స్ఫూర్తి నింపే ప్రయత్నం

ప్రతిపక్షాల నుంచి విమర్శలు, నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో, మద్దతుదారుల్లో మోదీ ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న నిరసనలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆరోపణలు, యూజీసీ మార్గదర్శకాలపై వ్యతిరేకత వంటి సవాళ్లను ప్రభుత్వం ఎదుర్కొంటోన్న నేపథ్యంలో, ప్రధాని ప్రసంగం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

వన్యప్రాణుల సంరక్షణ పై విద్యార్థులు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

ఎఫ్డీఓ రామ్మోహన్



ప్రజాస్ఫూర్తి,జన్నారం: వన్యప్రాణుల సంరక్షణ పై విద్యార్థులు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.అని జన్నారం ఎఫ్డీఓ ఎం.రామ్మోహన్ అన్నారు.వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా బుధవారం రోజున మండల కేంద్రంలోని పాఠశాలల విద్యార్థులచే స్థానిక ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం నుండి స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం నుండి మొదలుపెట్టి ప్రధాన రహదారి గుండా వెళుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు,అడవులను వన్యప్రాణులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అను నినాదాలతో విద్యార్థులంతా స్థానిక బస్టాండ్ వరకు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవ్వాల అభయారణ్యంలో అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, ఎంతో ముఖ్యమని వివరించారు. ప్రతి ఒక్కరూ కూడా అడవులను వన్యప్రాణులను కాపాడుటలో సరైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఫారెస్ట్ రేంజ్ అధికారి షేక్ బాబా ఖాదర్ వలీ, డిప్యూటీ రేంజ్ అధికారి పి.మమత, ఫారెస్ట్ అధికారులు అనిల్,ఎ. శంకర్, శివకుమార్,రవి,లక్ష్మణ్,సంతోష్,మంగ, పాఠశాల విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లో వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు నిధులు మంజూరు

ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



ప్రజాస్ఫూర్తి ,భైంసా: రైతులు ఎదుర్కొంటున్న లో వోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. తానూరు మండలంలోని భామ్ని గ్రామంలో 33/11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి రెండు కోట్ల 87 లక్షల 98 వేలు నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. కుబీర్ మండలంలోని వాయి లింగి గ్రామంలో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మూడు కోట్ల రెండు లక్షల 20వేల రూపాయలు నిధులు వెచ్చించడం జరిగిందన్నారు. సమస్యను గత నెల11 న సంబంధిత శాఖ మంత్రి కి విన్నవించడంతో వెంటనే నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల కు కృతజ్ఞతలు చెప్పారు.గ్రామాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

భైంసా గ్రీవెన్స్ డేలో ఎస్పీ డా. జి. జానకి షర్మిల ప్రత్యేక దృష్టి



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల బుధవారం భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు చేపట్టి సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు.కుటుంబ వివాదాలకు సంబంధించి షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి, సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. భైంసాలోనే కౌన్సిలింగ్ సదుపాయం కల్పించడం పట్ల బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు. గత గ్రీవెన్స్ డేల్లో అందిన పెండింగ్ ఫిర్యాదుల పరిష్కార స్థితిని ఎస్పీ సమీక్షించారు. పెండింగ్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు గ్రీవెన్స్ డే కార్యక్రమం ఉపయోగకరమైన వేదికగా నిలుస్తోందని ఎస్పీ తెలిపారు.

ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి): పోలీస్ శాఖలో ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ అందించనున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జయశంకర్ భూపాలపల్లి తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థుల ఎంపికకు స్టడీ సర్కిల్ బిల్డింగ్, రిజర్వేషన్ రోస్టర్/అర్హత నిబంధనలు, వయసు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఉచిత శిక్షణతో పాటు వసతి,భోజనం సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.అభ్యర్థులు ఎస్సై/పీసీ పోస్టులకు దరఖాస్తు చేసిన అప్లికేషన్/అక్నాలెడ్జ్‌మెంట్ ఫారం, ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్లు, టీసీ, కుల, ఆదాయ, రెసిడెన్షియల్ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను అక్టోబర్ 6 నుంచి 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు భూపాలపల్లిలోని స్టడీ సర్కిల్, ఆర్టీసీ కాలనీ, విద్యావల్లి హాస్టల్ సమీపంలోని కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9160606862 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

న్యూ కంజర్ భూ సమస్యలకు త్వరలో పరిష్కారం

- **చామన్‌పల్లిలో ఈ-సర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి**
- **జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి,భైంసా: నిర్మల్ జిల్లా లక్ష్మణచందా మండలం న్యూ కంజర్, చామన్‌పల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం పర్యటించి భూ సమస్యలు, రీ సర్వే పనుల పురోగతిని పరిశీలించారు. ముందుగా న్యూ కంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు, గ్రామస్తులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో భూముల పట్టాలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో గ్రామస్తుల సహకారం కీలకమని పేర్కొన్నారు. భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహించి, అర్హత ఉన్నప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చామన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వే పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలి ఉన్న కమతాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.రీసర్వేలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే బృందం సిబ్బంది పర్యవేక్షణలో, సంబంధిత భూ కమతాల రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో వనజ, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, లక్ష్మి, ఉప సర్పంచ్‌లు ముత్యం, గంగారెడ్డి, సంబంధిత అధికారులు,సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- **గొర్లవీడులో సైబర్ జాగృత దివస్ కార్యక్రమం**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సైబర్ జాగృత దివస్ సందర్భంగా భూపాలపల్లి పట్టణ సీఐ చెన్నూరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు గొర్లవీడు గ్రామంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, వ్యక్తుల పేర్లు, వివరాలను దుర్వినియోగం చేసే ఇంపర్సనేషన్ మోసాలు,పీఎం కిసాన్ యోజన పేరుతో పంపించే ఏపీకే ఫైళ్లు,ఆర్‌టీఓ ఈచలానా పేరుతో జరిగే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.గుర్తుతెలియని లింకులు, ఏపీకే ఫైళ్లు, అనుమానాస్పద మెసేజ్‌లు,ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు.అనుమానాస్పద ఆన్‌లైన్ లావాదేవీలు,మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని పోలీసులు సూచించారు.కార్యక్రమంలో ఎస్ఐలు బానోత్ గీత, ఏ. రవళి, సైబర్ వారియర్ సముద్రాల తిరుపతితో పాటు పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోదీ 25 ఏళ్లే ప్రజాసేవకు సేవా జ్యోతి యాత్ర



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా భూపాలపల్లిలో బుధవారం సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఏదునూతుల నిషీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్‌నేత, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డి పాల్గొన్నారు.అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రధాని మోదీ ప్రసంగాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. అనంతరం అక్కడి నుంచి పోచమ్మగుడి వరకు సేవా జ్యోతి యాత్ర నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద వికసిత్ భారత్ సంకల్ప సభ జరిగింది.ఈ సందర్భంగా వెంకటేష్‌నేత మాట్లాడుతూ మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తి చేసుకోవడం దేశ ప్రజలకు గర్వకారణమన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. చందుపట్ల కీర్తిరెడ్డి మాట్లాడుతూ సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అరుట్ల దశమంతరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి పాపన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాదరావు, జన్నె మొగిలి, ఎరుకల గణపతి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెండ్యాల రాజు, తాటికొండ రవికిరణ్, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : చందుపట్ల కీర్తి రెడ్డి



భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి): బీసీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి డిమాండ్ చేశారు. బీసీల సమస్యలను పరిష్కరించకుండా కేవలం హామీలకే పరిమితం కావడం సరికాదన్నారు.బీజేపీ తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్,ఓబీసీ మోర్చా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి పిడుగు కృష్ణ ముదిరాజు సూచనల మేరకు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమానికి చందుపట్ల కీర్తి రెడ్డితో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏదునూతుల నిషీధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కీర్తి రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బీసీలకు సంబంధించిన హామీలపై మాట్లాడుతున్నారని,ప్రస్తుతం ఉన్న అధికార కాలంలోనే బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని భవిష్యత్‌లో చెప్పడం కంటే, ప్రస్తుత పాలనలోనే బీసీల సమస్యలను పరిష్కరించి, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీసీలను ఉద్దేశించి మాయమాటలు, హామీలు చెప్పడం కాకుండా ఆచరణలో చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అరుట్ల దశమంత రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు నెలల్లో అర్హులందరికీ పట్టాల పంపిణీ

- **ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం: కొత్తగూడెం నగర పరిధిలోని వివిధ డివిజన్లలో రూ.169 లక్షల వ్యయంతో నిర్మించనున్న రోడ్లు, డ్రైన్లు, బతుకమ్మ ఘాట్ తదితర అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో మూడో విడతలో భాగంగా పట్టాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని, పలు దరఖాస్తుల పరిశీలన కోసం ఆరుగురు తహసీల్దార్ల నేతృత్వంలో ఆరు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సర్వే ప్రారంభించాయని చెప్పారు. రాబోయే రెండు నెలల వ్యవధిలోనే పూర్తి స్థాయి విచారణ ముగించి ప్రతి దరఖాస్తుదారుడికీ పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి, డివిజన్ల సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. శంకుస్థాపనలు పూర్తయిన అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్. కె సాబీర్ పాషా, మేయర్ మూడ గణేష్, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, కమిషనర్ సుజాత, తహసీల్దార్ పుల్లయ్య, కార్పొరేటర్లు , స్థానిక నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

వరికుప్పల వీరస్వామి భౌతిక దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం :చుంచుపల్లి మండలంలో రామాంజనేయ కాలనీ పంచాయతీ లో గాంధీ కాలనీ వాసులు సీనియర్ సిపిఐ పార్టీ నాయకులు వరికుప్పల వీరస్వామి మరణ వార్తను స్థానిక నాయకులు ద్వారా తెలుసుకొని వెంటనే వారి స్వగృహానికి వెళ్లి ఆయన భౌతిక దేహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించి వారి కుమారుడు రాజును భుజం తట్టి ఓదార్చుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ గణేష్,మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి , గ్రామ సర్పంచ్ , ఉప సర్పంచ్ సరిత ఠాగూర్ , కోడూరి నాగేష్ , వివిధ వార్డ్ మెంబర్స్ , గ్రామ పెద్దలు నాని , గ్రామ కార్యదర్శి రమేష్ ,బిల్ కలెక్టర్ షరీఫ్ , శానిటేషన్ సూపర్వైజర్ శివ , స్థానిక నాయకులు పాల్గొన్నారు .

డిజిటల్ అరెస్ట్ అంతా బూటకం భయపడితే డబ్బు ఖతం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ పిలుపునిచ్చారు. కురవి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పండుగలు,ఆఫర్ల పేరుతో వచ్చే నకిలీ లింకులు,భారీ బహుమతులు,లక్కీ డ్రా మెసేజ్ లను నమ్మవద్దని హెచ్చరించారు. తెలియని లింకులపై క్లిక్ చేయడం,యాప్ లను డౌన్లోడ్ చేయడం వల్ల బ్యాంకు డబ్బు క్షణాల్లో మాయమవుతుందని తెలిపారు. పోలీసులు,సీబీఐ, ఈడీ పేరుతో వీడియో కాల్ చేసి బెదిరించే డిజిటల్ అరెస్టులు పూర్తిగా మోసపూరితమని, నిజమైన అధికారులు ఎప్పుడూ వీడియో కాల్ లో అరెస్ట్ చేయరని,డబ్బులు అడగరని స్పష్టం చేశారు.అలాంటి కాల్స్ వస్తే వెంటనే కట్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.సోషల్ మీడియాలో ఫోటోలు,పాస్ వర్డ్ లు, ఓటీపీలు పంచుకోవద్దని, బంధువుల పేరుతో డబ్బులు అడిగే మెసేజ్ లు వస్తే ఫోన్ చేసి నిర్ధారించుకోవాలని సూచించారు. ఆన్ లైన్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ అంజలి, ఎస్ఐ,ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి లక్ష్మణ్ కుటుంబానికి పి సి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



ప్రజాస్ఫూర్తి , జన్నారం: జన్నారం మండలం పోనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని చెరుకుగూడకు చెందిన మంత్రి లక్ష్మణ్ అనారోగ్యంతో ఇటీవల చనిపోయిన విషయం తెలుసుకున్న పూర్ణ చందర్ రావు ఫౌండేషన్ ప్రతినిధులు ఈరోజు వారి కుటుంబాన్ని భార్యను ఇద్దరు కూతుర్లను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.అనంతరం కుటుంబానికి అండగా నిలుస్తూ పిసిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా మానవత్వం, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవాలనే సేవాభావాన్ని చాటి చెప్పారని కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పి సి ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ములుగు ప్రవీణ్, ఫౌండేషన్ సభ్యులు నోముల రాజ్ కుమార్, కొత్త శ్రీనివాస్, బాధవత్ సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను అక్రమ అరెస్టును ఖండిస్తూ ఎన్ఎస్ యుఐ దిష్టిబొమ్మ దహనం



ప్రజాస్ఫూర్తి,కొత్తగూడెం : చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ బైపాస్ సెంటర్ నందు సర్ ఓటర్ల జాబితా అంశంపై ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ , పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనను నిరసిస్తూ ఎన్ఎస్ యుఐ పిలుపుమేరకు జిల్లా అధ్యక్షుడు అజ్మీర సురేష్ నాయక్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్ర నాయకులను అదుపులోకి తీసుకున్న ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రజలకు సమాధానం చెప్పి నైతిక బాధ్యతగా రాజీనామా చేయాలని , ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు షేక్ నయీమ్, కాటి సందీప్ కుమార్, ప్రశాంత్, గౌతమ్, లక్కీ, అఫ్రోజ్, సాయి, ప్రవీణ్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

*** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**



కుత్బుల్లాపూర్ ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు.నియోజకవర్గ పరిధిలోని క్రాంతి నగర్‌లో సిఎంసి నిధులు రూ.16 లక్షల వ్యయంతో 110 మీటర్ల పొడవున నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నిత్యం ఉపయోగపడే రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన చోట నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, కోటపాటి మురళి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ బాల్ రెడ్డి, పద్మారావు, మనోజ్ శ్రీ హోమ్స్ కాలనీ అధ్యక్షులు అంజయ్య గౌడ్, క్రాంతి నగర్ కాలనీ అధ్యక్షులు బుగ్గ రెడ్డి, క్రాంతి నగర్ అసోసియేషన్ కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షులు తోట హరిబాబు, కాంగ్రెస్ నాయకులు నరేష్, నవీన్ కుమార్, నరసింహులు, కృష్ణ, జగదీష్, భాషా, శ్రవణ్ మరియు క్రాంతి నగర్ సోషల్ వెల్ఫేర్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బాంకెట్ హాల్‌లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొమ్మిదవ పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన గర్భిణి మహిళల శ్రీమంతం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ప్రతికుటుంబంలోపోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సిడిపిఓ సుబ్బలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు జహీర్, తాహెర్, అంజలి, వీరమ్మ, నాగమ్మ, కళావతి, జ్యోతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ కార్మికులకు చీరలను పంపిణీ



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు పరిష వేణు ఆధ్వర్యంలో 281 డివిజన్లోని గాంధీనగర్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా పారిశుద్ధ కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి నాయకులు శివకుమార్ ముదిరాజ్, గోపాల్ నేత, లావణ్య చంద్రప్రకాష్ ముదిరాజు, లక్ష్మి, భవాని, వరలక్ష్మి, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్టు నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను అరెస్టు చేసి ఓటు చోరీ పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా నిరసన చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు మరికొందని అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఎసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యల సూచనలతో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు జావేద్ బేగ్ ఆధ్వర్యంలో టైర్లు దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన




మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓట్ చోరీకి పాల్పడుతుందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్తున్న నాడు ఎవరు పట్టించుకోలేదని నేడు సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఆలంబిస్తున్న తీరుతో తేటతెల్లమైందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జ్ఞానేశ్ కుమార్ ను విధుల నుండి తొలగించి అరెస్టు చేసి ఓటు చోరీపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీతో కలిసి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బైరు వెంకన్న గౌడ్, అంజద్ అలీ, కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్లు నాగుల వాసు, భానుతు సైదులు నాయక్, నాయకులు అక్కినపల్లి జానయ్య,గడ్డం వెంకన్న,ఇశ్రార్ అహ్మద్,రుద్రంగి రవి, నరేందర్ నాయుడు, సాయి నేత,దంతాల సాయి నవీన్, సాజిత్ ఖాన్ (నీడ్స్),గుణగంటి సైదులు, బాణాల పవన్,వినయ్,అనిల్ మల్లేపాక,దంతాల నవీన్ తదితరులు పాల్గొన్నారు

గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు జరపాలి

*** జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారికి వినతి పత్రం**

ప్రజాస్ఫూర్తి,నల్లగొండ:జిల్లావ్యాప్తంగా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల ప్రాథమిక సహకార సంఘాల తక్షణమే ఎన్నికలు గెలిపించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి అల్లి వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో గొర్రెల పెంపకం దారులు జిల్లా పశు సంవర్ధక అధికారికి వినతి పత్రం అందజేశారు.జిల్లా వ్యాప్తంగా గొర్రెల పెంపకదారులకు వెంటనే డివార్మింగ్ నట్టల నివారణ మందులు తక్షణమే తాపించాలని వినతిపత్రంలో కోరారు. గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం సభ్యులు అందరికీ 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి చేయూత పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. గొర్రెలు మేపుకొనుటకు ప్రభుత్వ భూములు జీవో ఎంఎస్ నెంబర్ 559 రెవెన్యూ వ్యవసాయం డిపార్ట్మెంట్ 1996 ప్రకారం ప్రభుత్వ బంజర



భూములను గొర్రెల మేపుకొనుటకు అనుమతించుటకు ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి జీవో ఎస్ నెంబర్ 1016 ప్రకారం చెరువులు కట్టల మీద తుమ్మ చెట్లు మేపుకొనుటకు ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి వాటిని ప్రతి గ్రామంలో అమలు చేయాలని గొర్రెల పెంపకం దారుల అధ్యక్షులుకోరారు.రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో. గొర్రెల పెంపకం దారుల జిల్లా నాయకులు అల్లి వెంకన్న యాదవ్, బండెల తిరుపతయ్య యాదవ్,ఊరి బండి సైదులు యాదవ్, శ్రీకుంటి గొర్ల కోటి యాదవ్, ఆవుల జానయ్య యాదవ్ ,భారీ కొండయ్య యాదవ్, ఎల్లం లా అవులేను యాదవ్, మున్న సైదులు యాదవ్, గంగరాజు యాదవ్, వెంకన్న యాదవ్, దుర్గయ్య యాదవ్, బుర్రి వంశీ, బుర్రాజు నాగరాజు, సోమేశ్వర్ యాదవ్, ఆవుల సైదులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు..

*** ఎంఎస్ పూర్తి చేసిన అబ్దుల్ ఖుద్దూస్ కు. ఎమ్మెల్సీ రవీందర్ రావు అభినందన**

లండన్ నుంచి సొంతగడ్డకు

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ లో ఎంఎస్ పూర్తి చేసి మహబూబాబాద్ కు విచ్చేసిన మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్, ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ డా. తక్కెళ్లపల్లి రవీందర్ రావు ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్ రావు శాలువాతో సత్కరించి, ఎంఎస్ విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. విద్యాభ్యాసంతో పాటు లండన్ లోని



భారత హైకమిషన్,బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ లో తెలంగాణ, మహబూబాబాద్ జిల్లాకు సంబంధించిన అంశాలను ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమని కొనియాడారు. ఎన్నారైబిఆర్ఎస్ యూకే యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా యువతను చైతన్యపరుస్తూ,పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న తీరును ప్రశంసించారు. విద్యారంగంలో సాధించిన విజయాలు, సామాజిక అంశాలపై చూపుతున్న ఆసక్తి యువతకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

పౌష్టికాహారమే ఆరోగ్యానికి ఆధారం

*** బాలింతకు శ్రీమంతం చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి రమేష్ నాయక్**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : పౌష్టికాహారమే ఆరోగ్యానికి ఆధారమని మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గూగులోత్ జ్యోతి రమేష్ నాయక్ అన్నారు.మహబూబాబాద్ పట్టణంలోని 4వ వార్డు గాంధీపురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా గర్భిణీలు,బాలింతలు,చిన్నారులకు పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.అనంతరం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీకి తన ఆధ్వర్యంలో



సీమంత కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ,గర్భిణీలు, బాలింతలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా, దృఢంగా ఉండవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్కేజీ, యూకేజీ కే 30 వేల నుంచి 40 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీల్లో చేర్పించి నాణ్యమైన విద్య,మధ్యాహ్న భోజనాన్ని పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ అఖిల,సూపర్ వైజర్ భవాని,అంగన్వాడీ టీచర్లు నజ్మ,స్వప్న,సుజాత,శివకుమారి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాలి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి:గరిడేపల్లి మండలంలోని వెల్దండ గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల యోధుడు మెదరమెట్ల సీతారామయ్య 29వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, మేదరమెట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సీతారామయ్య కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. భూమి, రైతుల హక్కులు, పేద ప్రజల కోసం నాటి యోధులు చేసిన పోరాటాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.రైతాంగ సమస్యల పరిష్కారం.కోసం.సీతారామయ్యచూపిన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ కె యాకూబ్, హుజూర్నగర్ మండల కార్యదర్శి పోసలబోయిన హుస్సేన్, సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య, ఉప సర్పంచ్ యానాల సోమయ్య దోసపాటి బిక్షం, బొల్లిపల్లి శ్రీనివాస్, మండవ సైదులు, యానాల బిక్షమయ్య, సారెడ్డి సైదిరెడ్డి, వార్డు నెంబర్ శ్రీకాంత్, ములకలపల్లి కాశయ్య, రాంబాబు, యల్లావుల నారాయణ, గుండెపురి సైదులు, పుట్టల లక్ష్మయ్య ,పోలేపల్లి వెంకన్న పాల్గొన్నారు

ఉచిత న్యాయ సహాయం ను సద్వినియోగం చేసుకోవాలి

*** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ దీపా కాసరగడ్డ**



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం:మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ దీపా కాసరగడ్డ మాట్లాడుతూ.. తమ కేసుల పట్ల ఇరువర్గాల వారు పరస్పర అంగీకారం తో రాజీ పడవచ్చని రాజీ మార్గమే రాజమార్గం అని సూచించారు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండి తమరి వ్యక్తిగత గోప్యమైన సమాచారంను ఎవరికీ చెప్పరాదని తెలిపారు. 6 నుండి 14సం.. ల పిల్లలకు ఉచిత విద్యా హక్కు చట్టం ద్వారా ఉచిత విద్యను పొందవచ్చని తెలిపారు. వయోవృద్ధులైన తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. తల్లిదండ్రులు, పయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం ద్వారా పయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా రెవిన్యూ అభివృద్ధి కార్యాలయంలో తల్లిదండ్రులు, పయోవృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన ట్రిబ్యునల్స్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తును ఇచ్చిన వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కృష్ణయ్య, సబ్ ఇన్స్పెక్టర్ హిమబిందు, సర్పంచ్ ముంత మద్దిలేటి యాదవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజు, పారా లీగల్ వాలంటీర్ కల్పన, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఎన్నికల్లో కత్తెర గుర్తుకు ఓటేయాలి



భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి):ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి బహుజన వర్కర్స్ యూనియన్ (బీడబ్ల్యూయూ) నిరంతరం పోరాడుతోందని టీఆర్‌పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ అన్నారు. బుధవారం భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని కార్మికులను కలిసి కత్తెర గుర్తుపై ఓటు వేసి బీడబ్ల్యూయూ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం టీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రూపొందించిన మేనిఫెస్టో అమలుకు తమ సంఘం కృషి చేస్తుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్మికులు అధికంగా ఉన్న ఆర్టీసీలో వారి హక్కులు, వాటా కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి బలంగా తీసుకెళ్లే బహుజన వర్కర్స్ యూనియన్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీఆర్‌పీ జిల్లా నాయకులు జినుకల శ్రీను ముదిరాజ్, మీసాల రాజు, అట్టెం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల్లోనే మనిషి జ్ఞాపకం

*** కానుగ మొక్కలు పంపిణీ చేసిన హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న**



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి:వరంగల్ జిల్లా, పర్వతగిరి మండలం, దౌలత్ నగర్ గ్రామానికి చెందిన ఐలపాక ఐలయ్య జ్ఞాపకార్థం హరిత మిత్ర అవార్డు గ్రహీత, ప్రజా హృదయం సేవా సంస్థ అధ్యక్షులు దైద వెంకన్న కానుగ మొక్కలను పంపిణీ చేశారు.ఐలయ్య కుమారులు అశోక్,అనిల్ లకు మొక్కలను అందజేసి,ఆయన జ్ఞాపకం మొక్కల రూపంలో చిరకాలం నిలిచి ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, తాను ఇప్పటివరకు లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘమిత్ర కార్యదర్శి దోసపాటి మల్లన్న, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో బీజేపీ విజయయాత్ర.. టపాసులు పేల్చి సంబరాలు



ప్రజాస్ఫూర్తి ,ఖమ్మం జిల్లా: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (రూరల్) పథకం కింద దేశవ్యాప్తంగా 3.13 కోట్ల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా , 4.45 లక్షల మంది లబ్ధిదారులకు రుణ మాఫీ/వడ్డీ రాయితీ కల్పించిన సందర్భాన్నిపురస్కరించుకుని ఖమ్మంలో బీజేపీ ఆధ్వర్యంలో విజయయాత్ర నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ విజయయాత్రను బీజేపీ సీనియర్ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సెంటర్ నుండి చర్చి కాంపౌండ్ వరకు నాయకులు, కార్యకర్తలు,పీఎంఎవై లబ్ధిదారులు కాలినడకన టపాసులు పేలుస్తూ, పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ విజయయాత్ర చేశారు. పేదలందరికీ సొంత ఇల్లు అనే మోదీ కల నెరవేరిందని, ఇది బీజేపీకి గర్వకారణమని వారు తెలిపారు.అనంతరం చర్చి కాంపౌండ్ వద్ద ఏర్పాటు చేసిన సభలో నాయకులు మాట్లాడుతూ, పీఎంఎవై పథకం ద్వారా నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికే పెద్దపీట

మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది తెలిపారు. బుధవారం పట్టణంలోని 18వ వార్డులో 5 లక్షలవ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రతి వార్డులో అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు మాలోత్ చంద్రు నాయక్, నిమ్మల వెంకన్న మున్సిపల్ డి.ఇ.ప్రణయ్ రెడ్డి,ఏ.ఇ.తిరుమలయ్య వార్డు అధికారి నాగార్జున వార్డు ప్రజలు పాల్గొన్నారు.


మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత



ప్రజాస్ఫూర్తి, ఆదిలాబాద్ జిల్లా :మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రామ్‌ల్యాం' అమలులో భాగంగా ఎన్ఆర్ఎల్ఎం పథకం కింద బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాదు గ్రామీణ మండలం రాజర్షిషాగూడ గ్రామానికి చెందిన అర్హులైన మహిళ సంఘాల సభ్యులకు ఆయన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పథకం అమలులో భాగంగా గొర్రెలు,మేకల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ఝాన్సీ లక్ష్మీ,అంజలి మహిళా సంఘాలను గుర్తించి వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో గ్రూపులో నలుగురు సభ్యుల చొప్పున గుర్తించి, వారికి రూ. 1 లక్ష చొప్పున (ఒక్కొక్కరికి రూ. 25,000) రుణం అందించామని తెలిపారు. ఈ ఆర్థిక సహాయంతో మహిళలు మేకల పెంపకం చేపట్టి, వాటిని సక్రమంగా పెంపకం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఏపిఎం అనిల్, డిపిఎం శోభా, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యంగా 'సేవా జ్యోతి కలశ యాత్ర'

*** అల్వాల్‌లో ఘనంగా నిర్వహణ**



అల్వాల్ , ప్రజాస్ఫూర్తి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న *'సేవా సంకల్ప్ అభియాన్'*లో భాగంగా అల్వాల్‌లోని శోభా గార్డెన్స్‌లో 'సేవా జ్యోతి కలశ యాత్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజా సేవా భావాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఆమెతో పాటు కాకతీయనగర్ డివిజన్ అధ్యక్షుడు జగదీష్ చారి, పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి, ప్రముఖ హాకీ క్రీడాకారుడు ఎన్. ముకేష్ కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈకార్యక్రమంలోమేడ్చల్ -మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు డి. గిరివర్ధన్ ,మంగేష్, సాయి సురేష్, సంతోష్ పరమేష్, శివ గౌడ్, జ్యోతిర్మయి, అనసూయ, సుమలత, శ్రీదేవి, స్వర్ణ, భారతి, లక్ష్మి, వెంకటేష్ నేత, గురవయ్య, శంకర్, పంజా శ్రీనివాస్, శ్రీధర్, రాజేష్ తదితరులు, కార్యకర్తలు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బందితో మున్సిపల్ చైర్‌పర్సన్ సమావేశం



ప్రజాస్ఫూర్తి, ఆదిలాబాద్ జిల్లా :ఆదిలాబాద్ మున్సిపల్ ఫిల్టర్ బెడ్ వద్ద శానిటేషన్ సిబ్బంది, ట్రాక్టర్లు, టాటా ఏస్ వాహనాల డ్రైవర్లు, శానిటేషన్ జవాన్లు, ఎస్ఐలతో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలో జనాభా, విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా వాహన డ్రైవర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లోని చెత్తను పూర్తిగా తరలించాలని సూచించారు.ప్రతి ఒక్కరూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విధులను తప్పనిసరిగా నిర్వహించి, తమకు కేటాయించిన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే శానిటేషన్ జవాన్లు, ఎస్ఐల ద్వారా లేదా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఆదిలాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో శానిటేషన్ సిబ్బంది, ట్రాక్టర్ డ్రైవర్లు, టాటా ఏస్ డ్రైవర్లు, జవాన్లు, ఎస్ఐలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ఆదిలాబాద్ పట్టణాన్ని స్వచ్ఛమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఐ శంకర్ , జవాన్లు శానిటేషన్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీస్కూళ్లుగా తీర్చిదిద్దాలి



ప్రజాస్ఫూర్తి, ఆదిలాబాద్ జిల్లా: జిల్లాలో పోషణ మాసం వేడుకలను పకడ్బందీగా నిర్వహించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీస్కూళ్లుగా తీర్చిదిద్ది పిల్లల ప్రాథమిక విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.బుధవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "పోషణ మాసం - 2026", "అంతర్జాతీయ బాలికల దినోత్సవం - 2026" వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తొలి 1000 రోజులలో పిల్లల మానసిక వికాసానికి ప్రాధాన్యతనివ్వాలని, ప్రభుత్వం అందించిన పుస్తకాలు, డిజిటల్ సాధనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలకు అందే సరుకుల్లో నాణ్యత చాలా ముఖ్యమని, కోడిగుడ్లు తప్పనిసరిగా 45 నుండి 50 గ్రాముల బరువు ఉండాలని, తక్కువ బరువున్నవాటిని తక్షణమే తిరస్కరించి వెనక్కి పంపాలని స్పష్టం చేశారు.అలాగే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీ ప్రక్రియను రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పూర్తిచేస్తామని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా సిడిపిఓలకు పోషణ చాంపియన్ అవార్డ్స్ ను, విద్యార్థులకు న్యూట్రిషన్ కిట్ లను అందజేశారు.అనంతరం అనీమియా నియంత్రణ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించి, అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్నిపురస్కరించుకొని బాల్య వివాహాల నిర్మూలనకు అతిథులు సంతకాలను చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, డిఎంహెచ్ఓ సాధన, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, డిఈఓ మాధవి, ఇతర అధికారులు, సీడీపీవోలు, అంగన్వాడిలు,తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు,కంకి నల్లిని అరికట్టాలి

*** మండల వ్యవసాయ అధికారిణి రామడుగు వాణి**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: వరి సాగులో ఎండకు తెగులు నివారణ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారిణి రైతులకు సూచించారు. బుధవారం కూసుమంచి మండలంలోని కొత్తూరు గ్రామంలో వరి పొలాలను రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. పంటను పరిశీలించిన అనంతరం వరి పంటలో బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు, కంకి నల్లి ఎక్కువగా వ్యాపిస్తున్నట్లు తెలిపారు.రైతులు ఈ చీడ పీడల నివారణకు తగిన చర్యలు పాటించాలని సూచించారు. బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు నివారణకు, స్ట్రెప్టోసైక్లిన్ 30 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 200 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.ఈ తెగులు కనిపించిన పొలాల్లో అధికంగా యూరియా వేయకుండా, పొలంలో నీటిని నిల్వ ఉంచకుండా తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. వరిలో ప్రస్తుత పరిస్థితుల్లో కంకి నల్ల అధికంగా ఉందని దీని నివారణకు స్పైరోమెసిఫిన్ 22.9శాతం ఎస్‌సి 200 మీ.లీ మందును 200 లీటర్ల నీళ్లలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలకంఠం, వ్యవసాయ విస్తరణ అధికారి రఘు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


*** అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి:జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖలు, ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు.జిల్లాలో 335 గ్రామ సమాఖ్య భవనాలు మంజూరు కాగా 17 పూర్తయ్యాయని, 187 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. 100 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కాగా 10 చోట్ల పనులు ప్రారంభం కాలేదని, కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతుల పనులను త్వరగా పూర్తి చేయాలని, ఇందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. చేయూత పింఛన్ల కోసం జిల్లాలో 9,466 దరఖాస్తులు వచ్చాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలోని 8,163 స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ ప్రక్రియను పూర్తి చేయాలని, ఇందిరమ్మ మహిళా చీరల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.అధికారులు తమ పరిధిలోని అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించి, పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, పంచాయతీరాజ్ ఈఈ ధర్మేందర్‌తో పాటు పంచాయతీరాజ్, టీజీ ఈడబ్ల్యూఐడీసీ, గిరిజన సంక్షేమ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ నుంచి తెలంగాణకు ఆరోగ్య సందేశం

*** ఫిట్‌నెస్ బాటలో ఎమ్మెల్యే మురళి నాయక్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ జాతీయ క్రీడాకారుడు లయన్ బొడ్డుపల్లి ఉపేంద్రం పిలుపు మేరకు ఖేలో ఇండియా బంధన్ తెలంగాణ బంధన్ ఫిట్‌నెస్ ఛాలెంజ్‌ను మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు డాక్టర్ ఉమా మురళి నాయక్ స్వీకరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల్లో ఫిట్‌నెస్, వాకింగ్, వ్యాయామంపై అవగాహన పెరగాలని,ప్రజాప్రతినిధులు స్వయంగా ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు స్ఫూర్తినివ్వాలని పిలుపునిచ్చారు. తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. మహబూబాబాద్ నుంచి మొదలైన అడుగు తెలంగాణ ఆరోగ్య బంధంగా మారాలని, వాకింగ్ చేద్దాం, ఆరోగ్యంగా ఉందామని అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేంద్రం కోరారు.

ఆర్టీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండి



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి:ఈనెల 9న జరిగే ఆర్టీసీ గుర్తింపు సంఘ ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎంప్లాయిస్ యూనియన్ టిఎంయు, ఎస్ ఎం యు నాయకులు ఆర్టీసీ కార్మికులను అభ్యర్థించారు.బుధవారం హుస్నాబాద్ డిపో ఎదుట వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధన ఆర్టిసి సంస్థ పరిరక్షణ, కార్మికుల పెండింగ్ బకాయిల సాధన, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను సాధించేందుకు కూటమి అభ్యర్థులు కృషి చేస్తారని అందుకు ఈనెల 9న జరిగే ఎన్నికల్లో ప్రతి కార్మికుడు బస్సు గుర్తుపై నిచ్చెన గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో పేరుకుపోయిన బకాయిలు మరియు ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ముఖ్యంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. ఆర్టీసీ మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని,కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. అందరూ ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో ఎంప్లాయిస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ ఈ మూడు కూటముల అభ్యర్థులను బలపరుస్తూ బస్సు, నిచ్చెన గుర్తులపై ఓటు వేసి గెలిపించాలని ఐక్య కూటమి అభ్యర్థులు ఆర్టీసీ కార్మికులను అభ్యర్థించారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాస్ఫూర్తి, ఆదిలాబాద్ జిల్లా :మంచి చెడు తెలియని వయసులో ఏది..గుర్తు తెలియని వ్యక్తులు చెప్పిన మాయమాటల్లో పడి ఆడపిల్లలు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కష్టపడుతూ ఉన్నంత స్థాయికి ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. హుస్సేన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఎల్ఎస్ఎ సెక్రెటరీ బి. హుస్సేన్ మాట్లాడారు..అవకాశాలు అందరికీ సమానంగా ఉంటాయని వాటిని అందిపుచ్చుకొని తమ లక్ష్యాలను సహకరించుకోవాలని సూచించారు. బాల్య వివాహం చట్టరీత్య నేరమని అలా చేయించిన వారికి రెండు సంవత్సరాల జైలు శిక్ష తో పాటు లక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

చౌదరిగూడెం పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

*** షాద్‌నగర్ ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పు.. రూ.10 వేల జరిమానా**

ప్రజాస్ఫూర్తి ,షాద్‌నగర్: చౌదరిగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి షాద్‌నగర్‌లోని ప్రత్యేక పోక్సో కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడెం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 121/2021గా కేసు నమోదైంది. ఈ కేసు ప్రత్యేక సెషన్స్ కేసు నంబర్ 55/2022గా విచారణకు వచ్చింది. భారతీయ శిక్షాస్మృతిలోని 354డి, 323, 506 సెక్షన్లతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్‌విత్ 12 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో చౌదరిగూడెం మండలానికి చెందిన షేక్ అజ్మీర్ (42)ను నిందితుడిగా పోలీసులు పేర్కొన్నారు. కేసును విచారించిన షాద్‌నగర్‌లోని అత్యాచారం, పోక్సో కేసుల విచారణ,పరిష్కారానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన న్యాయస్థానం న్యాయమూర్తి ఎస్. స్వాతిరెడ్డి బుధవారం తీర్పు వెలువరించారు. నిందితుడిని ఐపీసీ సెక్షన్ 506, పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్‌విత్ 12 కింద దోషిగా నిర్ధారించిన కోర్టు.. ఒక్కో సెక్షన్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నెల రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొంది. ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సబియా సుల్తానా వాదనలు వినిపించారు. దర్యాప్తు అధికారిగా చౌదరిగూడెం ఎస్ఐ కె. వెంకటేశ్వర్లు వ్యవహరించారు. షాద్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాస్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు జరిగింది. ప్రస్తుతం చౌదరిగూడెం ఎస్ఐగా బి. వెంకటేష్ విధులు నిర్వహిస్తున్నారు. కోర్టు డ్యూటీ కానిస్టేబుల్ పి శ్రీశైలం, సమన్స్ విభాగం సిబ్బంది శ్రీ నికేతన్, లైజన్ ఆఫీసర్ సక్రియా నాయక్ మహిళా కానిస్టేబుల్ కే జ్యోతి తదితరులు ఈ కేసు సహకరించారు.

ఘనంగా సేవా జ్యోతి కలశ యాత్ర



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా:భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో "సేవా జ్యోతి కలశ యాత్ర" ఘనంగా నిర్వహించారు.మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో,ఉదయం 9 గంటలకు మెదక్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద సేవా జ్యోతి కలశ యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు హాజరయ్యారు.అనంతరం రాందాస్ చౌరస్తా నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాదయాత్రగా పాల్గొని పోస్టాఫీసు కూడలి వరకు చేరుకున్నారు. అక్కడ"సేవా జ్యోతి కూడలి"గా పేరు పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా ప్రారంభమైన ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజా సేవ, సుపరిపాలన, దేశ అభివృద్ధి లక్ష్యాలతో సాగుతున్న సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి మెదక్ జిల్లా ఇన్చార్జి బొక్క నరసింహారెడ్డి,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, సంగసని సురేష్, పట్టణ అధ్యక్షుడు నాని ప్రసాద్ మెదక్ కౌన్సిలర్ అఖిలాభారత్, పబ్బ రాజమణి లక్ష్మణ్ బెండవీన, కలిపి నాగరాజు నల్లాల విజయ్, లోకేష్ ,అల్లం మధు, యువ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లికా మైనార్టీ మోర్చా అధ్యక్షుడు గ్యాన్సింగ్ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రాములు నాయక్ ,వెల్మకన్నె రాజేందర్ శంకర్ గౌడ్ ఎం.ఎల్.ఎన్ రెడ్డి ,నాయకులు, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, మోర్చాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


ఉద్యమకారుల ఆకాంక్ష లు నెరవేర్చే లక్ష్యంగా పని చేద్దాం

: పోకల



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి : మలిదశ తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చుట లక్ష్యంగా పని చేద్దామని యంటీయుకే సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పోకల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులచే నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 14 ఏళ్ల పాటు అలుపెరుగని పోరాటంతో ఉద్యమకారుల కుటుంబ జీవితాలు అస్తవ్యస్తమయాయని, వారి చెమట చుక్క, రక్తపు మరక ఆనవాళ్ళతో అందలమెక్కిన నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను ఉరికంబమెక్కించిందన్నారు. ఏ కాంగ్రెస్ పార్టీని అయితే పడగొట్టామో అదే పార్టీ ఈరోజు ఉద్యమకారులకు గుర్తింపుని ఇవ్వడంలో ముందుకు రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేకే కమిటీకి తుది నిర్ణయపు బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు మేకపోతుల నరసయ్య, వీరంరెడ్డి శంబిరెడ్డి, పంగ వీరయ్య, కారింగుల రామయ్య, ఎడవెల్లి బాటసారి, బెల్లంకొండ శేఖర్, పిడమర్తి రాజు, బొమ్మ నాగరాజు, అనంతు చంద్రయ్య, సప్పిడి శంబిరెడ్డి, గోపాల్ రెడ్డి, రాతికింది వీరస్వామి, పోలిశెట్టి రామయ్య, గుగులోతు హేమ్లా నాయక్, వెంకటరెడ్డి, కీసర వెంకటేశ్వర్లు, పిట్ట నరసయ్య తదితరులున్నారు.

స్వార్థం లేకుండా దేశ హితం కోసం ఆలోచించే వ్యక్తి ప్రధాని మోదీ




ప్రజాస్ఫూర్తి ,భైంసా:దేశ ప్రజలే కుటుంబ సభ్యులుగా భావించి ఎలాంటి స్వార్థం లేకుండా దేశహితం కోసమే ఆలోచించే వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్మే ఫంక్షన్ హాల్ లో సేవా సంకల్ప యాత్ర సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఆయన చేస్తున్న సేవలు శాశ్వతంగా ప్రజల గుండెల్లో ఉండిపోతాయన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మూడవ స్థానానికి ఎగబాకి నేడు ప్రపంచాన్ని శాసించే స్థాయికి విశ్వ గురువుగా ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారంటే, రోజుకు 18 గంటల పాటు ఆయన ప్రజల కోసం పనిచేస్తున్నారన్నారు. 370 ఆర్టికల్ రద్దు తో పాటు ఎన్నో విజయాలు సాధించిన ఘనత ప్రధాని దే నన్నారు... అయన ఆశయాలకు అనుగుణంగా బిజెపి, నాయకులు కార్యకర్తలు నడుచుకోవాలని సూచించారు.

పోస్ట్ ఆఫీస్ కి వాటర్ డిస్పెన్సర్ వితరణ

కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కూసుమంచి మండలంలోని జక్కేపల్లి బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ కి నలబోలు వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన మాతృమూర్తి సూరమ్మ బుధవారం వాటర్ డిస్పెన్సర్ ను వితరణగా అందజేశారు.ఈ సందర్భంగా వాటర్ డిస్పెన్సర్ ను సర్పంచ్ నలబోలు చంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.బ్రాంచ్ పోస్ట్ మాస్టర్,గ్రామస్తులు,పోస్ట్ ఖాతాదారులు చంద్రారెడ్డి కుటుంబ సభ్యులను అభినందించి,ధన్యవాదాలు తెలియజేశారు.

డీ-ఫామ్ భూముల పరిరక్షణకు బాధితుల ధర్నా

- **బహుజన ముక్తి పార్టీ ఉపాధ్యక్షులు సిరిశాల శ్రీనివాస్ మద్దతు**
- **సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక.**



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి :డీఫామ్ పట్టాల ద్వారా గతంలో నిరుపేద కుటుంబాలకు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం కేటాయించిన భూములను అక్రమంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని, భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట కొంతకాలంగా బాధితులు నిరంతరాయంగా ధర్నా నిర్వహిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం, డీఫామ్ పట్టాల ద్వారా భూములు పొందిన కొంతమంది నిరుపేద కుటుంబాలు వారసత్వ వివాదాలు, ఇతర కారణాలతో గ్రామాన్ని విడిచి వెళ్లిన సమయంలో ఇదే అదునుగా తీసుకుని కొందరు వ్యక్తులు వారి భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు. స్థానిక రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని వారు ఆరోపిస్తున్నారు.ఈ భూముల సమస్యపై సీపీఐ నాయకుడు బాదే నరసయ్య బాధితుల తరపున గతంలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేసినట్లు బాధితులు తెలిపారు. హైకోర్టు బాధితులకు అనుకూలంగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఆ ఆదేశాలను అమలు చేయకుండా భూ ఆక్రమణదారులకు అధికారులు సహకరిస్తున్నారని వారు ఆరోపించారు.ఈ నేపథ్యంలో బుధవారం బహుజన ముక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు , నల్లగొండ జిల్లా పార్లమెంటు అభ్యర్థి సిరిశాల శ్రీనివాస్ గరిడేపల్లి ఎమ్మార్వో కార్యాలయం వద్ద కొనసాగుతున్న బాధితుల ధర్నాను సందర్శించారు. బాధితులకు సంఘీభావం తెలిపి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సిరిశాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. డీఫామ్ పట్టాల ద్వారా భూములు పొందిన నిరుపేదల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు. హైకోర్టు ఆదేశాలను గౌరవించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి, బాధితుల భూములను వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.బాధితుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే భవిష్యత్తులో బహుజన ముక్తి పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిరిశాల శ్రీనివాస్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజాస్ఫూర్తి ,భైంసా:నిర్మల్ జిల్లాలో 89 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో అంగన్వాడీ టీచర్ల పోస్టుల భర్తీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల వారీగా అందిన దరఖాస్తుల వివరాలు, అర్హతల పరిశీలన, ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్ల భర్తీ ప్రక్రియలో అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం జరిగేలా నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రతి దశను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను పకడ్బందీగా పరిశీలించాలని, ఎలాంటి సందేహాలకు అవకాశం లేకుండా అవసరమైన స్థాయిల్లో పత్రాలను మరోసారి ధ్రువీకరించుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, సీడీపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన



ప్రజాస్ఫూర్తి ,జన్నారం: జన్నారం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు, జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జన్నారం ఎస్సై శ్రీ జి. ఉదయ్ కిరణ్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపైఆన్లైన్ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఫేక్ జాబ్ ఆఫర్లు, డిజిటల్ అరెస్ట్ ల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే ఓటిపి, ఏటీఎం పిన్, సి వి వి, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్వర్డ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు.తెలియని లింకులు, ఏపీకే ఫైల్స్, అనుమానాస్పద యాప్లను డౌన్లోడ్ చేయకూడదని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు, వదంతులను నిర్ధారణ లేకుండా ఇతరులకు ఫార్వర్డ్ చేయవద్దని సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 నెంబర్ కు ఫోన్ చేసి, జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీజేపీ, బీఆర్ఎస్ నేతల చేరికలు



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో వారు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.బీజేపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపగాని స్వామి, నాయకులు కంచర్ల శ్రీనివాస్, గోలకొండ విజేందర్, బీఆర్ఎస్ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, సీనియర్ నాయకుడు గోపగాని శివరాములు, ఎస్సీ సెల్ నాయకులు ఎలగొండ శంకర్, చెన్నమల్ల మొగిలి, బీసీ సెల్ నాయకులు ఆరెల్లి సంతోష్, అనుముల రవి, గజ్జి నరేష్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి స్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కష్టపడి పనిచేసే వారికి కాంగ్రెస్‌లో ప్రాధాన్యం ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దబ్బెట అనిల్, మాజీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గజ్జి రవి, సర్పంచ్ జన్నే సురేష్, వార్డు సభ్యుడు కంచు బిక్షపతి, యూత్ అధ్యక్షుడు కంచర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు అఖిలపక్షాల పాదయాత్ర



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి):రాజ్యాంగ పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం ఇండియా కూటమి ఆధ్వర్యంలో అఖిలపక్షాలు గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పాదయాత్ర నిర్వహించనున్నాయి. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీజేఎస్, సీపీఐ(ఎంఎల్) పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ కార్యక్రమం హనుమాన్ ఆలయం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగుతుందని ఆయా పార్టీల నాయకులు తెలిపారు.అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పాదయాత్రకు ఇండియా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సోతుకు ప్రవీణ్‌కుమార్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కిరణ్, సీపీఎం జిల్లా నాయకుడు ఆకుదారి రమేష్ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, నేరెళ్ల జోసెఫ్, అఖిల్ కిషోర్, నాగరాజు, కోనూరి భగత్, మరాఠీ కాంతారావు, పోతుల పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ దరఖాస్తులపై నాలుగేళ్లుగా సమాచారం లేదు



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తులకు సకాలంలో సమాచారం అందలేదని మేడ్చల్‌కు చెందిన సామాజిక కార్యకర్త టి. రమేష్ గుప్తా తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదులపై విచారణకు సంబంధిత అధికారులకు కమిషన్ నోటీసులు జారీ చేసింది.రమేష్ గుప్తా 2022 నవంబర్ 17, నవంబర్ 23, డిసెంబర్ 7 తేదీల్లో మేడ్చల్ సర్కిల్ 60, సీబీసీ డిప్యూటీ కమిషనర్/పీఐఓ కార్యాలయంలో మూడు ఆర్టీఐ దరఖాస్తులు దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ కేసులపై అక్టోబర్ 13న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మొజాంజాహి మార్కెట్‌లోని సమాచార హక్కు భవన్‌లోని 103వ గదిలో విచారణ జరగనుంది. ఈ మేరకు అక్టోబర్ 3న సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసినట్లు రమేష్ గుప్తా తెలిపారు.ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం లేదా ఆలస్యం నిర్ధారణ అయితే సంబంధిత పీఐఓపై జరిమానా విధించే అవకాశం ఉంది. అయితే జరిమానా, నష్టపరిహారం వంటి అంశాలపై విచారణ అనంతరం కమిషన్ నిర్ణయం తీసుకోనుంది.

ఇండస్ట్రియల్ పార్కుకు రైతుల సహకారం ముఖ్యం



ప్రజాస్ఫూర్తి, ఆదిలాబాద్ జిల్లా :జిల్లాలో ప్రతిపాదిత నూతన పారిశ్రామిక పార్కు (ఇండస్ట్రియల్ పార్క్) ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో బోరజ్ మండలంలోని గిమ్మ, రాంపూర్, గూడ గ్రామాల రైతులు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నుండి న్యాయమైన రీతిలో పరిహారం, పునరావాస చర్యలు అందజేస్తామని హామీ ఇచ్చారు. భూసేకరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని, రైతులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావ్, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, ఆయా మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువత పై డ్రగ్స్ ప్రభావం లఘు చిత్రం పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనలో చిన్న ముల్కనూర్ గ్రామంలో జరిగిన సమావేశంలో తౌటు రాజు నిర్మాతగా మడుపు శ్రీనివాస్ దర్శకత్వంలో యువత పై డ్రగ్స్ ప్రభావం మరియు వాటి నిర్మూలన మీద చిత్రీకరించిన లఘు చిత్రం ఒక్క అడుగు మరియు తెలంగాణ లో బతుకమ్మ సంస్కృతి గూర్చి తెలిపే బతుకమ్మ తల్లి చిత్రాల పోస్టర్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో నిర్మాత నటులు తౌటు రాజు దర్శకులు మడుపు శ్రీనివాస్ రోషన్ రజాక్ అజయ్ మహేందర్ దేవేందర్ రెడ్డి బోడిగే రాజు పిట్టల రమేష్ జాల రాములు మొదలగునటులు సర్పంచుల పోరం మండల అధ్యక్షులు కొండాపూర్ సర్పంచ్ మార్క రాజకుమార్ ఉప సర్పంచ్ బింగి రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు చిత్ర బృందానికి మంత్రి అభినందనలు తెలిపారు.

నల్గొండలో ఘనంగా వికసిత్ భారత్ సంకల్ప సభ,సేవా జ్యోతి యాత్ర



ప్రజాస్ఫూర్తి,నల్గొండ:భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్నసందర్భంగా,బీజేపీ నల్గొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణ గడియారం సెంటర్ లో వికసిత్ భారత్ సంకల్ప సభ సేవా జ్యోతి యాత్ర_ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథిగా బీజేపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి విచ్చేసి మాట్లాడారు. ఉదయం 10 గంటలకు ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియం నుండి ప్రధాని మోదీ చేసిన వర్చువల్ ప్రసంగాన్ని నల్గొండలోని బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద తెరపై తిలకించారు. అనంతరం గడియారం సెంటర్ నుండి ఎన్.జి. కాలేజ్ వరకు సేవా జ్యోతి కాగడాల ర్యాలీ భారీగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, మహిళలు, యువత, నరేంద్ర మోదీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నాంపల్లి ప్రత్యేక కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే కుంభం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహించిన రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన కేసులో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నాంపల్లి ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసు విచారణను పూర్తి చేసిన నాంపల్లి ప్రత్యేక కోర్టు తుది తీర్పుగా కేసును కొట్టివేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల కోసం రక్షకుల కోసం వ్యతిరేకంగా వచ్చిన నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ ఆనాడు రాజభవన్ ముట్టడిని చేసినామని అందుకు అప్పటి ప్రభుత్వం తమపై పెట్టిన కేసు నుండి విముక్తి లభించినట్లు తెలిపారు. ఇది కార్మిక కర్షక విజయంగా అభివర్ణించినారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ , యాదాద్రి డీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకునూరి మహేందర్ , కాంగ్రెస్ యువ నాయకులు ఏడుమేకల మహేష్, ప్రదీప్ తదితరులు కోర్టుకు హాజరయ్యారు.తీర్పు అనంతరం నాయకులంతా కలిసి టీ తాగుతూ ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలు, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు

ఆదిలాబాద్ చేరుకున్న మీడియా అకాడమీ చైర్మన్

*** రెండు రోజుల పాటు మీడియా ప్రతినిధులకు శిక్షణా తరగతులు**



ప్రజాస్ఫూర్తి, ఆదిలాబాద్ జిల్లా : మీడియా ప్రతినిధులకు అక్టోబర్ 8, 9 తేదీల్లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీపీఆర్వో విష్ణువర్ధన్, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, మీడియా ప్రతినిధులు రాజేశ్వర్, దేవేందర్, సురేష్ షాహిద్, వినోద్, వెంకటేష్, కిరణ్ తదితరులు శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.రెండు రోజుల శిక్షణలో మీడియా రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక సాంకేతికత వినియోగం, వృత్తిపరమైన నైపుణ్యాల పెంపుదల తదితర అంశాలపై మీడియా ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నారు.

ఐక్య కూటమిని గెలిపిద్దాం... ఆర్టీసీని పరిరక్షించుకుందాం

*** మందా నరసింహారావు**



ప్ర జా స్ఫూ ర్తి , కొత్తగూడెం:ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎస్ డబ్ల్యూ ఎఫ్, టి యం యు, టి డబ్ల్యూ యు, ఐ ఎన్ టి యు సి కూటమినీ గెలిపించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు నాయకులు బుధవారం కొత్తగూడెం బస్ డిపో నందు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద నరసింహారావు పాల్గొని మాట్లాడుతూ ఐక్య కూటమికే ఓట్లు వేస్తే ఆర్టీసీ సంస్థ కోసం కట్టుబడి పని చేస్తారని ,ఆర్టీసీ సంస్థ ప్రైవేటుపరం చేయాలని ప్రయత్నం చేస్తున్న పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని వారన్నారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం అనేక పోరాటాలను శ్రీకారం చుట్టే ఎస్డబ్ల్యుఎఫ్ టిఎంయూ కూటమికే ఆర్టీసీ కార్మికులు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. రాష్ట్రంలో బాణం గుర్తుకు , రీజియన్ లో నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని వేసి ఆర్టీసీని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సాంప్రదాయ సంస్కృతిని కాపాడుకోవాలి: యానాల దామోదర్ రెడ్డి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో మహిళా సమాఖ్య, ప్రజా నాట్యమండలి కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. ముందుగా సిపిఐ జిల్లా కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం నిర్వహించిన సభకు తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కల్లెం కృష్ణ, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు బుషపాక నరసింహ,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి నయీమ్ నాయకులు ఇంజా హేమలత, సామల శోభన్ బాబు, పుట్ట రమేష్, మాటూరి జానమ్మ, యానాల సంధ్య, మంచాల రాధమ్మ, సుగుణ, కట్ల యాదగిరి, మొగుళ్ళ శేఖర్ రెడ్డి, బోడ సోమనర్సయ్య, జాను, అండాలు, సరిత, పుష్ప, విజయ, సంధ్య, మల్లమ్మ శ్రీదేవి, కవిత, వాణి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు పాఠశాలల కు నాయకత్వం వహించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: జిల్లాలోని విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం అన్నిపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు ప్రధాన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయుల ఒక రోజు సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఎఫ్.ఎల్.ఎన్.లో ప్రగతి సాధించడానికి ప్రతి పాఠశాలలో వారానికి ఒక గంట సేపు రీడింగ్ అవర్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. మండలాలు ,కాంప్లెక్స్ ల వారీగా సమీక్ష చేసి, వివిధ విషయాలలో వెనుకబడి ఉన్న ప్రధానోపాధ్యాయులను కారణాలు అడిగి తెలుసుకుని, తిరిగి జరిపే సమీక్షా సమావేశంలో ప్రగతి మెరుగు చూపించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరులో,ఇతర విద్యా విషయాల్లో జిల్లాను ఉన్నత స్థానంలో ఉండేలా కృషి చేయాలని కోరారు.జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి మాట్లాడుతూ.. ఎఫ్.ఎల్.ఎన్, ఎ.ఎక్స్.ఎల్, మధ్యాహ్న భోజనం,నోటు పుస్తకాలు,పాఠ్య పుస్తకాలు, వర్క్ పుస్తకాలు,ప్రతిభా గ్రేడ్ ఇండెక్స్,అకాడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్,పూర్వ ప్రాథమిక విద్య,ఎఫ్. ఆర్.ఎస్,ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, యు.డైస్ డ్రాప్ బాక్స్ ,ఆధార్, అపార్, టాయిలెట్స్, విద్యుత్తు, త్రాగు నీరు,సమగ్ర శిక్ష,పి.ఎం.శ్రీ సివిల్ పనులు , నిధుల ఖర్చు,ఏకరూప దుస్తులు, బూట్లు,బెల్టులు,ఎస్. హెచ్.వి.ఆర్,ప్రశస్తి మరియు ఓపెన్ స్కూల్ లో ప్రవేశాలు,పదవ తరగతి పరీక్షల ప్రణాళిక మొదలైన అంశాల మీద సమగ్ర సమీక్ష జరిపారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సి.హెచ్.శ్రీనివాస్, జిల్లా కామన్ పరీక్షల బోర్డు అధికారి పాండు,ప్రభుత్వ పరీక్షల విభాగం అదనపు కార్యదర్శి శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారులు అండాలు,శ్రీహరి అయ్యంగార్, పెసరు లింగారెడ్డి,జానీ ఆఫ్ఘన్, ఎం.నరహరి,జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్,స్కాట్స్ అధికారి కే.కే. శ్రీధర్,పాఠ్య పుస్తకాల సహ శాఖాధికారి బి.రమేష్, ఎఫ్.ఎల్.ఎన్.రాష్ట్ర బాధ్యులు కావ్య,చందన,మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు,మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్ళు,కేజీబీవీ ఎస్. ఓ.లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

– స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన



ప్ర జా స్ఫూ ర్తి , భ ద్రా ద్రి కొత్తగూడెం:వృద్ధులు కుటుంబానికి, సమాజానికి అమూల్యమైన సంపద అని, తమ జీవిత అనుభవం, జ్ఞానం, విలువలతో సమాజ నిర్మాణంలో వృద్ధులు విశిష్ట పాత్ర పోషిస్తున్నారని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన పేర్కొన్నారు. వృద్ధుల పట్ల గౌరవం, ఆప్యాయత, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రా మీ ణా భి వృద్ధి సం స్థ ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో వృద్ధుల దినోత్సవ వేడుకలను ని ర్వ హిం చా రు. కా ర్య క్ర మా నికి అదనపు కలెక్టర్ ఎం. విద్యాచందన ముఖ్య అతిథిగా హాజరై వృద్ధులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల హక్కుల పరిరక్షణ, గౌరవప్రదమైన జీవనం, ఆరోగ్యం, సామాజిక, ఆర్థిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి వృద్ధుడికి చేరేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వృద్ధులు తమ హక్కులు, ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న సేవలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేందర్, జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా విద్యాశాఖ అధికారి శంభు ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి అనూష, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌రెడ్డి, న్యాయవాది యు. అరుణ్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ దినేష్, అదనపు డీఆర్‌డీఓ నీలేష్, సెర్ప్ హైదరాబాద్ ప్రతినిధి రంగారావు, పిఇజెడ్ఎస్ అధ్యక్షురాలు సుజాత, ఎన్‌జీవో ప్రతినిధి జ్యోతి, సఖి కేంద్ర ప్రతినిధులు, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, వృద్ధుల ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సుందరగిరి గడ్డపై జానపద జాతర!

- కనుకవ్వ బతుకమ్మ పాట 2026

- కోలాహలంగా 'కనకవ్వ' బతుకమ్మ పాట చిత్రీకరణ



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి :కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామం బుధవారం పండుగ శోభతో పరవశించిపోయింది. ప్రముఖ తెలంగాణ జానపద గాయని కనకవ్వ గ్రామానికి విచ్చేయడంతో ఊరంతా ఉత్సాహభరితంగా మారింది. రాబోయే పండుగను పురస్కరించుకుని రూపొందిస్తున్న శ్రీ ఫిల్మ్ మ్యూజిక్ ప్రెజెంటేషన్ లో 'బతుకమ్మ 2026' ప్రత్యేక జానపద గీతం వీడియో చిత్రీకరణ సుందరగిరిలోని ప్రకృతి రమణీయ ప్రాంతాల్లో అత్యంత వైభవంగా జరిగింది.ఈ పాటలో కనుకవ్వకు తోడుగా 'జబర్దస్త్' ఫేమ్ నటి యోధ నటించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా సాగిన ఈ చిత్రీకరణలో గ్రామ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ ఆడారు. కనకవ్వ, యోధల సందడితో గ్రామంలో ముందస్తు పండుగ సంబరాలు అంబరాన్నంటాయి.

కళాకారులకు ఘన స్వాగతం

గ్రామానికి విచ్చేసిన కళాకారులకు సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి, గ్రామ ప్రజల తరఫున ఘనంగా స్వాగతం పలికారు. షూటింగ్ నిర్విఘ్నంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పంచాయతీ తరఫున సమకూర్చారు. సుందరగిరి వంటి గ్రామంలో ఇటువంటి పెద్ద ప్రాజెక్ట్ షూటింగ్ జరగడం ఊరికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టిందని, గ్రామ ప్రతిష్టను పెంచిందని ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. కనకవ్వను, చిత్రీకరణను ప్రత్యక్షంగా తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అలరించనున్న బతుకమ్మ పాట

శ్రీ ఫిల్మ్ మ్యూజిక్' సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ పాటను బాషం పోచవ్వ, ఎ. నాగేశ్వరమ్మ నిర్మించగా, ఎ. అశోక్ సహ నిర్మాతగా వ్యవహరించారు. దర్శకత్వం, ఛాయాగ్రహణం (డిఓపి), కూర్పు (ఎడిటింగ్) బాధ్యతలను అరుణ్ కొలుగూరి నిర్వహించారు. పాలోజీ గంగాచారి సాహిత్యం అందించగా, వెంకట్ అజ్మీర్ సంగీతాన్ని సమకూర్చారు. సన్ని గణేష్ నృత్య దర్శకత్వం వహించారు.అంజి,చిరంజివి,రవి నటించారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, ఉపసర్పంచ్ మేడబోయిన రాజు,మాజీసింగిల్ విండో చైర్మన్ జంగ రమణారెడ్డి,రిటైర్ టీచర్ చికోటి రమణయ్య, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సహకారం అందించిన గ్రామస్థులు ఆవుల శ్రీనివాస్, బొల్లబత్తిని మహేష్, బరిగెల మహేందర్, రెడ్డి శ్రీనివాస్, నల్లగొని సురేష్,మాహిళ సంఘం విఒఎ లు ఎనగందుల లత,తాళ్ళపల్లి వసంత తదితరులు ఉన్నారు.

జిల్లాలో డ్రగ్స్ వినియోగం అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి:కలెక్టర్ కార్యాలయంలోని వి.సీ హాలులో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ తో కలసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఎన్ని కేసులు నమోదు అయ్యాయని ఆరా తీసి డ్రగ్స్ ఏమైనా పట్టుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో కంపెనీల పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. యువత మాదక ద్రవ్యాల వాడకుండా కాలేజీలలో,గ్రామాలలో, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లడుతూ ఫ్యాక్టరీ పని చేసే వారి పై నిఘా ఉంచాలని,కాలేజీ లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.జిల్లాలో అందరూ సమన్వయంతో డ్రగ్స్ నిర్మూలన జిల్లాగా ఉండేందుకు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సజ్ అధికారి తుక్యా నాయక్,జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సొంత జెసిబి తో పనుల నిర్వహణ


*** కౌన్సిలర్ బొంతల నరసింహ**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి:భువనగిరి మున్సిపాలిటీ కే ఆదర్శంగా నిలుస్తున్న కౌన్సిలర్ బొంతల నరసింహ. గతంలో అభివృద్ధికి నోచుకోని వార్డులో భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్ మరియు మున్సిపల్ అధికారుల సహకారంతో వార్డులో నెలకొన్న సమస్యలను తీర్చుకుంటూ ముందుకు సాగు తున్నారు. ఇప్పటికే డబల్ బెడ్ రూమ్ కాలనీలో నీటి సమస్య ఏర్పడడంతో తన సొంత వాటర్ ట్యాంకర్ తో మంచినీటిని వార్డు ప్రజలకు అందిస్తూ, కృష్ణ వాటర్ పైప్ లైన్ లీకేజీ కావడంతో వెంటనే తన సొంత జెసిబి తో లీకేజీ పనులను దగ్గర నుండి సమస్యను పరిష్కరించినారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు కౌన్సిలర్ చేస్తున్న మంచి పనులను అభినందిస్తున్నారు. ఇలాంటి ప్రజా నాయకుడు ఉంటే ఆ వార్డు అభివృద్ధి చెందుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

హుస్నాబాద్ లో గాంధీ చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకుల భారీ నిరసన

హుస్నాబాద్,ప్రజాస్ఫూర్తి:ఓటరు సవరణ ప్రక్రియను పేరుతో ఎన్నికలను అపహాస్యం చేశారని ఆరోపిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక గాంధీ చౌక్ వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుత నిరసన తెలుపుతున్న లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇండియా కూటమి సభ్యుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని విమర్శించారు.జాతిపిత మహాత్మా గాంధీ సాక్షిగా భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందని ఆయన అన్నారు.ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ఓట్లె లక్ష్యం చేసుకుని తొలగిస్తున్నారని ఆరపణలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు ఓటు బచావో దేశ్ బచావో అనే నినాదంతో ప్రజలలో చైతన్యం తీసుకొస్తున్నారని మంత్రి అన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి వైస్ చైర్మన్ చిత్తారి పద్మ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వి.వి రమణ వివిధ మండలాల అధ్యక్షులు వివిధ గ్రామాల సర్పంచులు మార్కెట్ కమిటీ చైర్మన్ లు ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఫౌజీ కంటే ముందే..

ప్రభాస్ సినిమాల రిలీజ్ ఆర్డర్‌లో మార్పు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. తొలుత హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' ముందుగా, సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' ఆ తర్వాత విడుదల కావాల్సి ఉంది. అయితే 'ఫౌజీ' షూటింగ్ ఆలస్యం కావడంతో రిలీజ్ ఆర్డర్ మారినట్లు తెలుస్తోంది. ఫౌజీని తొలుత డిసెంబర్‌లో విడుదల చేయాలని భావించినప్పటికీ.. షూటింగ్ పూర్తికాకపోవడంతో ఆ రిలీజ్ ప్లాన్ నుంచి తప్పించారు. ఈ చిత్రానికి ఇంకా 60 రోజులకుపైగా షూటింగ్ చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. దాంతో వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. మరోవైపు 'స్పిరిట్' షూటింగ్ అనుకున్నప్రకారం కొనసాగుతోంది. మిగతా షూటింగ్ పూర్తయితే 2027 మార్చి, ఏప్రిల్‌లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ప్లాన్ ప్రకారం 'ఫౌజీ' కంటే ముందే 'స్పిరిట్' థియేటర్లలోకి రానుంది. ఫౌజీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. స్పిరిట్‌ను భద్రకాళి పిక్చర్స్, టీ-సిరీస్ సంస్థలు నిర్మిస్తున్నాయి. యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న 'స్పిరిట్'లో ప్రభాస్ మాజీ పోలీస్ అధికారిగా కనిపించనున్నాడు.

నమ్మలేకపోతున్న!

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. కరీనా కపూర్ ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న పాపులర్ టాక్ షో 'వాట్ ఉమెన్ వాంట్' సీజన్ 6 త్వరలో ప్రారంభం కానుంది. ఈ సీజన్‌కు సంబంధించిన ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఇందులో కృతి సనన్‌తో కరీనా జరిపిన చర్చ ఆసక్తికరంగా మారింది. రక్షాబంధన్ సందర్భంగా తాను నటించిన యాడ్‌పై జరిగిన వివాదాన్ని కృతి ప్రస్తావించింది. 'నా చోలి గురించి ప్రైమ్‌టైమ్ న్యూస్‌లో ఆరుగురు సభ్యుల ప్యానెల్ చర్చించడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాను' అని వ్యాఖ్యానించారు. మహిళల దుస్తులపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో.. 'మహిళలు నిజంగా ఏం కోరుకుంటారు?' అని కరీనా అడగ్గా.. 'తమను జడ్జ్ చేయకుండా ఉండాలని, ఎవరి పని వారు చూసుకోవాలని' కృతి బదులిచింది. జ్యువెలరీ బ్రాండ్ జీవా విడుదల చేసిన యాడ్‌లో కృతి తన సోదరుడితో పాటు పెంపుడు కుక్కకు రాఖీ కట్టారు.





మళ్లీ తల్లి కాబోతున్న కియారా

బాలీవుడ్ హీరోయిన్ కియారా అద్వానీ, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా దంపతులు మరోసారి తల్లిదండ్రులు కాబోతున్నారు. తమ రెండో బిడ్డ రాబోతున్నట్లు ఈ జంట బుధవారం) సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 'మరోసారి తల్లిదండ్రులుగా మారబోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. మా హృదయాలు ప్రేమతో నిండిపోయాయి' అంటూ కియారా-సిద్ధార్థ్ దంపతులు సంయుక్తంగా పోస్ట్ చేశారు. తమ కుమార్తె సారాయా మల్హోత్రా చేతిని చూపిస్తూ.. పక్కనే తెల్లటి బేబీ సాక్స్‌ను ఉంచిన ఫొటోను కియారా షేర్ చేసింది. గతేడాది జూలైలో కియారా-సిద్ధార్థ్ దంపతులకు తొలి సంతానంగా సారాయా జన్మించింది. తాజాగా ఏడాది తర్వాత రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్నట్లు ప్రకటించారు. దీంతో అభిమానులతో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, కియారా ఇటీవల 'టాక్సిక్' చిత్రంలో కనిపించింది. తెలుగులో భరత్ అనే నేను, వినయ విధేయ రామ, గేమ్ ఛేంజర్ చిత్రాల్లో నటించిన విషయం తెలిసిందే.



ఆ టాలెంట్ ఉందా?

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తనలోని ఓ విచిత్రమైన టాలెంట్‌ను బయటపెట్టింది. తన నాలుకను దాదాపు 360 డిగ్రీల వరకు తిప్పగలనని వెల్లడించింది. అయితే ఇది తనకు పెద్దగా ఉపయోగపడని.. 'చాలా స్టుపిడ్, యూజ్‌లెస్ స్కిల్' అని చెప్పడం విశేషం. పారిస్ ఫ్యాషన్ వీక్ సందర్భంగా 'ది కట్'తో జరిగిన సంభాషణలో తనలోని దాగి ఉన్న ప్రతిభ గురించి అడగ్గా.. జాన్వీ ఈ విషయాన్ని వెల్లడించింది. పాఠశాల రోజుల్లో తన క్లాస్‌మేట్స్ నాలుకతో ముక్కును తాకించేందుకు పోటీపడేవారని తెలిపింది. తాను మాత్రం అలా చేయలేకపోయేదానినని, అయితే ఇతర పిల్లలను ఆకట్టుకోవాలనుకునేదాని నని చెప్పింది. ఈ క్రమంలోనే తన నాలుకను మరో విధంగా తిప్పగలనని గుర్తించిన జాన్వీ.. దానినే తనదైన ప్రత్యేక 'పార్టీ ట్రిక్'గా మార్చుకుంది. నటన, ఫ్యాషన్‌తో వార్తల్లో నిలిచే జాన్వీకి ఇలాంటి విచిత్రమైన టాలెంట్ కూడా ఉందని తెలిసి అభిమానులు ఆసక్తిగా స్పందిస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలో పలువురు భిన్నంగా స్పందించారు. జాన్వీ నటనపై దృష్టి సారించాలంటూ పలువురు సలహాలు సూచనలిచ్చారు.



ట్రైలర్ లాంచ్‌కు ముహూర్తం ఫిక్స్

విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ట్రైలర్‌ను గురువారం సాయంత్రం 6.03 గంటలకు విడుదల చేయనున్నారు. 3 నిమిషాల 47 సెకన్ల నిడివితో ట్రైలర్‌ను సిద్ధం చేశారు. భారీ విజువల్స్‌తో తెరకెక్కిన ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు నెలకొన్నాయి. ట్రైలర్‌తో సినిమాపై మరింత హైప్ పెరుగుతుందని చిత్ర బృందం భావిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో 'ది మమ్మీ' ఫేమ్ ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్రలో కనిపించనున్నారు. అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండను మునుపెన్నడూ చూడని పీరియడ్ పాత్రలో చూపించనున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.